

# ప్రజాస్పూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 11-11-2025 | సంపుటి - 25 | సంచిక -176 | రూ : 4 | పేజీలు: 8


## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల పోలింగ్‌కు

# సర్వం సిద్ధం




- రేపు ఉదయం ప్రారంభం కానున్న పోలింగ్
- పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్
- డ్రోన్ల ద్వారా సెక్యూరిటీ మానిటరింగ్ చేస్తామన్న కర్ణన్

2లో



2లో

## అందెశ్రీ మృతిపై ప్రధాని మోదీ స్పందన

- ప్రముఖ కవి అందె శ్రీ మృతిపై ప్రధాని మోదీ సంతాపం
- ఆయన మరణం సాంస్కృతిక, మేధో ప్రపంచానికి తీరని లోటు అని వెల్లడి
- అందె శ్రీ ఆలోచనలు తెలంగాణ ఆత్మను ప్రతిబింబించాయన్న ప్రధాని



2లో

## కేసీఆర్ బాధతో

# కుమిలిపోతున్నారు..

### ఆయనను చూస్తుంటే సానుభూతి కలుగుతోంది: రేవంత్ రెడ్డి

- బీఆర్ఎస్ కాలగర్భంలో కలిసిపోతున్న పార్టీ అన్న రేవంత్ రెడ్డి
- ఆ పార్టీ వ్యాలిడిటీ పీరియడ్ ముగిసిపోయిందని వ్యాఖ్య
- కేసీఆర్‌కు గతమే తప్ప భవిష్యత్తు లేదన్న సీఎం

## మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన

# అజారుద్దీన్

- మైనార్టీల సంక్షేమం, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖల బాధ్యతల స్వీకరణ
- కుటుంబ సభ్యులతో కలిసి సచివాలయానికి రాక
- ముస్లిం మత పెద్దల ప్రార్థనల అనంతరం ఛాంబర్‌లో బాధ్యతల స్వీకారం



2లో




2లో

# భారీ పేలుడు..

- పలు నగరాల్లో హై అలర్ట్ ప్రకటించిన కేంద్ర హోంశాఖ
- ఈ ఘటనలో 8 మంది మృతి, 24 మందికి గాయాలు
- చాందినీ చౌక్ మెట్రో స్టేషన్ వద్ద జరిగిన దుర్ఘటన
- ఉగ్రవాద నిరోధక దళం, స్పెషల్ సెల్ దర్యాప్తు ప్రారంభం
- కీలక ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేసిన పోలీసులు

## విమానాలపై..

# ఆకతాయి చేష్టలు ఆగవా




- తాజాగా బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానానికి బాంబు బెదిరింపు
- 5గంటల పాటు ప్రయాణికులకు ఇబ్బందులు

లండన్ నుంచి హైదరాబాద్ వస్తున్న బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానానికి వచ్చిన బాంబు బెదిరింపు ప్రయాణికులకు చుక్కలు చూపించింది. లండన్ హీత్రూ విమానాశ్రయం నుంచి మధ్యాహ్నం 2.23 తరువాయి 2లో

## పుట్టపర్తికి ప్రధాని మోదీ రాక నేపథ్యంలో

# పటిష్ట ఏర్పాట్లు..



2లో

# కేసీఆర్ బాధతో కుమిలిపోతున్నారు... ఆయనను చూస్తుంటే సానుభూతి కలుగుతోంది

హైదరాబాద్, నవంబర్ 10 : బీఆర్ఎస్ కాలగర్భంలో కలిసిపోతున్న పార్టీ అని, దాని వ్యాలిడిటీ పీరియడ్ అయిపోయిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను రాజకీయ విమర్శల కోసం ఈ మాటలు చెప్పడం లేదని, ఒకప్పుడు తెలంగాణలో బలంగా ఉన్న తెలుగుదేశం పార్టీ ఇప్పుడు ఎలా కనుమరుగైందో బీఆర్ఎస్ పరిస్థితి కూడా అలాగే మారుతుందని జోస్యం చెప్పారు. కేసీఆర్‌తోనే ఆ పార్టీ ప్రస్థానం ముగిసిపోతుందని అన్నారు. కేసీఆర్‌కు గతమే తప్ప భవిష్యత్తు లేదని, ఆ బాధతోనే ఆయన ఇంటి నుంచి బయటకు రావడం లేదని రేవంత్ రెడ్డి విమర్శించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థికి ఓటు వేయాలని ఆ పార్టీ అధినేతగా కేసీఆర్ ఇప్పటివరకు ప్రజలను కోరకపోవడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. "ఆరోగ్య సమస్యల వల్ల ఆయన ప్రచారానికి రాలేకపోవచ్చు. కానీ, కనీసం పార్టీ అభ్యర్థిని గెలిపించాలని ఒక ప్రకటన కూడా ఇవ్వడం లేదు. దీన్నిబట్టి కేటీఆర్, హరీశ్‌రావుపై ఆయనకు ఎలాంటి అభిప్రాయం ఉందో అర్థం చేసుకోవచ్చు" అని వ్యాఖ్యానించారు. తన కళ్ల ముందే పార్టీ కూలిపోతుంటే కేసీఆర్ దుఃఖంతో కుమిలిపోతున్నారని, ఆయన్ను ప్రత్యర్థిగా కాకుండా సానుభూతితో చూడాల్సిన పరిస్థితి వచ్చిందని ఎద్దేవా చేశారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఆత్మహత్య చేసుకుని బీజేపీకి అవయవదానం చేసిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ సహకారం వల్లే బీజేపీ 8 సీట్లు గెలుచుకుందని, ఆ సీట్లే నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాని కావడానికి ఉపయోగపడ్డాయని అన్నారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీన ప్రక్రియ మొదలైందని కేసీఆర్ కుమార్తె కవితే స్వయంగా చెప్పిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. 2004 నుంచి 2014 వరకు కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీయే రైతుల సంక్షేమానికి, హైదరాబాద్ అభివృద్ధికి బాటలు వేసిందని రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌కు గోదావరి జలాలు రావడానికి నాటి సీఎల్పీ నేత పీజేఆర్ చేసిన పోరాటమే కారణమని గుర్తుచేశారు. ఐటీ, ఫార్మా హబ్‌గా హైదరాబాద్ మారడానికి కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలే పునాది వేశాయన్నారు. ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాలతో సంక్షేమం, అభివృద్ధిని కాంగ్రెస్ సమన్వయం చేసిందని పేర్కొన్నారు. ఈ చరిత్ర కేసీఆర్ చెరిపేస్తే చెరిగిపోయేది కాదన్నారు. ఆనాటి పదేళ్ల కాంగ్రెస్ పాలనను, కేసీఆర్ పదేళ్ల పాలనను బేరీజు వేసుకోవాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

## అందెశ్రీ మృతిపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందన

ఢిల్లీ, నవంబర్ 10 : ప్రముఖ కవి, జన వాగ్గేయకారుడు అందె శ్రీ మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం మన సాంస్కృతిక, మేధో ప్రపంచంలో పూడ్చలేని లోటు అని అభివర్ణించారు. ఈ మేరకు ప్రధాని కార్యాలయం ఆయన సంతాప సందేశాన్ని విడుదల చేసింది. అందె శ్రీ ఆలోచనలు తెలంగాణ ఆత్మను ప్రతిబింబిస్తాయని మోదీ కొనియాడారు. "అందె శ్రీ మరణం మన సాంస్కృతిక, మేధో ప్రపంచంలో పూడ్చలేని లోటు. ఆయన ఆలోచనలు తెలంగాణ ఆత్మను ప్రతిబింబిస్తాయి. ఒక గొప్ప కవి, మేధావి అయిన ఆయన, ప్రజల పోరాటాలకు, ఆకాంక్షలకు, అకుంఠిత స్ఫూర్తికి గొంతుకగా నిలిచారు. ఆయన పదాలకు హృదయాలను కదిలించే శక్తి, అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను ఏకం చేసే శక్తి, ప్రజల సాంఘిక హృదయస్పందనకి రూపం ఇచ్చే శక్తి ఉన్నాయి. ఆయన సామాజిక స్పృహను, సాహితీ సౌందర్యంతో మిళితం చేసిన విధానం అద్వితీయం. వారి కుటుంబసభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. ఓం శాంతి" అంటూ మోదీ తన ప్రకటనలో పేర్కొన్నారు.

## మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అజారుద్దీన్

హైదరాబాద్, నవంబర్ 10 : టీమిండియా మాజీ కెప్టెన్, తెలంగాణ మంత్రి అజారుద్దీన్ ఈరోజు తన శాఖల బాధ్యతలు స్వీకరించారు. సచివాలయంలోని తన ఛాంబర్‌లో కుటుంబ సభ్యుల సమక్షంలో, ముస్లిం మత పెద్దల ప్రార్థనల మధ్య ఆయన బాధ్యతలు చేపట్టారు. ఆయనకు కేటాయించిన మైనార్టీల సంక్షేమం, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖల మంత్రిగా అధికారికంగా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి అజారుద్దీన్ మాట్లాడుతూ, తనపై ఎంతో నమ్మకం ఉంచి ఈ గురుతర బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తానని స్పష్టం చేశారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అజారుద్దీన్‌కు పలువురు అధికారులు, నేతలు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. గత నెల 31వ తేదీన అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. రాజ్‌భవన్‌లో ఆయన చేత గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రమాణం చేయించారు. అనంతరం నవంబర్ 4వ తేదీన అజారుద్దీన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మైనార్టీ సంక్షేమ, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖలను అప్పగించారు. తాజాగా ఆయన ఈ శాఖల బాధ్యతలను అధికారికంగా స్వీకరించారు.

## ఢిల్లీలో భారీ పేలుడు...
## పలు నగరాల్లో హై అలర్ట్ ప్రకటించిన కేంద్ర హోంశాఖ

ఢిల్లీ, నవంబర్ 10 : దేశ రాజధాని ఢిల్లీ భారీ పేలుడుతో దద్దరిల్లింది. ఎర్రకోట సమీపంలోని రద్దీ ప్రాంతంలో సోమవారం సాయంత్రం ఓ కారులో శక్తివంతమైన పేలుడు సంభవించింది. ఈ దుర్ఘటనలో 8 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 24 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన నేపథ్యంలో మహారాష్ట్ర రాజధాని ముంబైతో పాటు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా అధికారులు హై అలర్ట్ ప్రకటించారు. దేశంలోని పలు నగరాల్లో కేంద్ర హోంశాఖ హై అలర్ట్ ప్రకటించింది. వివరాల్లోకి వెళితే.. చాందినీ చౌక్ మెట్రో స్టేషన్ సమీపంలో ఈ పేలుడు జరిగినట్లు డిప్యూటీ చీఫ్ ఫైర్ ఆఫీసర్ ఏకే మాలిక్ తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే సుమారు 20 ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. రాత్రి 7:29 గంటల సమయానికి మంటలను అదుపులోకి తెచ్చినట్లు ఆయన వెల్లడించారు. పేలుడు తీవ్రతకు సమీపంలోని మూడు, నాలుగు వాహనాలు కూడా ధ్వంసమయ్యాయి. క్షతగాత్రులను హుటాహుటిన సమీపంలోని లోక్‌నాయక్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే 8 మంది మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. పేలుడు చాలా పెద్ద శబ్దంతో సంభవించిందని, భారీ అగ్నిగోళం ఎగిసిపడినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఘటనా స్థలంలోని దృశ్యాలు పేలుడు తీవ్రతను తెలియజేస్తున్నాయి. సమాచారం అందుకున్న వెంటనే ఉగ్రవాద నిరోధక దళం (యాంటీటెర్రర్ స్క్వాడ్), ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ బృందాలు రంగంలోకి దిగి దర్యాప్తు ప్రారంభించాయి. పర్యాటకులు ఎక్కువగా ఉండే ఈ ప్రాంతాన్ని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. ఈ ఘటనతో ముంబై, ఉత్తర ప్రదేశ్ అప్రమత్తమయ్యాయి. ముంబైలోని కీలక ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేసినట్లు భద్రతా వర్గాలు తెలిపాయి. అదేవిధంగా, యూపీలోని అన్ని జిల్లాల్లో హై అలర్ట్ ప్రకటించారు. సున్నితమైన ప్రాంతాల్లో గస్తీ, తనిఖీలను పెంచాలని లక్నో నుంచి ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం

హైదరాబాద్, నవంబర్ 10 : జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నిక పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. మంగళవారం ఉదయం ప్రారంభం కానున్న పోలింగ్ కోసం ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. యూసఫ్‌గూడలోని డీఆర్‌సీ సెంటర్‌లో ఈసీ అధికారులు సిబ్బందికి ఈవీఎంలను, పోలింగ్ స్టేషన్లను కేటాయించారు. ఎన్నికల సిబ్బంది సాయంత్రం లోగా పోలింగ్ స్టేషన్లకు చేరుకుంటారు. జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈసారి డ్రోన్ల ద్వారా సెక్యూరిటీ మానిటరింగ్ ఉంటుందని కర్ణన్ తెలిపారు. ప్రతి అభ్యర్థికి ఒక్కో పోలింగ్ ఏజెంట్ పాస్‌ను అందించినట్లు ఆయన పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై తెలంగాణ రాష్ట్రం మొత్తం ఆసక్తిగా ఉంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఓటర్లు ఎవరికి పట్టం కడతారో ఈ నెల 14న తేలనుంది.

## మళ్లీ పరుగులు పెడుతున్న బంగారం, వెండి ధరలు..
## రూ.1.22 లక్షలు దాటిన 10 గ్రాముల పసిడి

ఢిల్లీ, నవంబర్ 10 : బంగారం, వెండి ధరలు ఇవాళ భారీగా పెరిగాయి. అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు, వచ్చే నెలలో అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించవచ్చన్న అంచనాలు బులియన్ మార్కెట్‌కు కొత్త ఊపునిచ్చాయి. దేశీయ మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజ్ (MCX)లో ఉదయం 10 గంటల సమయంలో బంగారం ధర 1.16 శాతం పెరిగి 10 గ్రాములకు రూ.1,22,468కి చేరింది. అదేవిధంగా వెండి ధర 1.99 శాతం వృద్ధితో కిలోకు రూ.1,50,666 వద్ద ట్రేడ్ అయింది. అక్టోబర్‌లో రికార్డు స్థాయికి చేరిన తర్వాత కొంత తగ్గుముఖం పట్టిన పసిడి ధరలు, మళ్లీ పుంజుకున్నాయి. అమెరికా ఆర్థిక వ్యవస్థ పనితీరుపై పెరుగుతున్న ఆందోళనలు, వచ్చే నెలలో వడ్డీ రేట్ల కోత ఉండొచ్చన్న అంచనాలు పసిడికి డిమాండ్ పెంచుతున్నాయి. మెహతా ఈక్విటీస్‌కు చెందిన కమొడిటీస్ వైస్ ప్రెసిడెంట్ రాహుల్ కలాంత్రీ ప్రకారం గత వారం మొత్తం ధరలలో తీవ్ర ఒడుదొడుకులు కనిపించినా, అమెరికాలో వినియోగదారుల సెంటిమెంట్ బలహీనపడటం, ప్రభుత్వ షట్‌డౌన్‌పై నెలకొన్న అనిశ్చితి కారణంగా ధరలు తిరిగి కోలుకున్నాయి. అమెరికాలో ప్రభుత్వ షట్‌డౌన్ రికార్డు స్థాయికి చేరడం ఆర్థిక వ్యవస్థపై ఆందోళనలను మరింత పెంచిందని, దీంతో సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం వైపు పెట్టుబడిదారులు మళ్లుతున్నారని ఆయన వివరించారు. మరోవైపు డాలర్ ఇండెక్స్ బలహీనపడటం కూడా బంగారం, వెండి ధరల పెరుగుదలకు కారణమైంది. ఇదిలా ఉంటే.. ముడి చమురు ధరలు కూడా ఈరోజు పుంజుకున్నాయి. బ్యారెల్ డబ్ల్యూటీఐ క్రూడ్ ధర 60 డాలర్ల మార్కును దాటింది. ఒపెక్, ఐఈఏ నుంచి వెలువడనున్న నివేదికల కోసం ట్రేడర్లు ఎదురుచూస్తున్నారు. అయితే, ఒపెక్ దేశాలు ఉత్పత్తి పరిమితులను సడలించడం, అమెరికా ఉత్పత్తిని పెంచడం వంటి కారణాలతో సరఫరా మిగులుపై అంచనాలు మార్కెట్‌ను మిశ్రమంగా ఉంచుతున్నాయి.




## విమానాలపై ఆకతాయి చేష్టలు ఆగవా

లండన్ నుంచి హైదరాబాద్ వస్తున్న బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానానికి వచ్చిన బాంబు బెదిరింపు ప్రయాణికులకు చుక్కలు చూపించింది. లండన్ హీత్రూ విమానాశ్రయం నుంచి మధ్యాహ్నం 2.23 గంటలకు (అక్కడి కాలమానం ప్రకారం) బయలుదేరిన (బీఏ 277) బోయింగ్ 7878 ట్విన్ జెట్ విమానం, సోమవారం ఉదయం 5.22 గంటలకు (భారత కాలమానం ప్రకారం) హైదరాబాద్ విమానాశ్రయంలో ల్యాండ్ అయ్యింది. ఈ విమానంలో బాంబ్ పెట్టినట్లు గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఇమెయిల్ ద్వారా విమానయాన అధికారులకు బెదిరింపు రావడంతో, హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జీఐఏ)లో ఉత్కంఠ నెలకొంది. 212 మంది ప్రయాణికులతో వచ్చిన ఈ విమానాన్ని పటిష్ఠ భద్రతా ఏర్పాట్ల నడుమ, టెర్మినల్ భవనానికి దూరంగా నిలిపారు. అక్కడకు చేరుకున్న సీఐఎస్ఎఫ్ బాంబ్ స్క్వాడ్, స్థానిక పోలీసులు, ఇతర భద్రతా సిబ్బంది కలిసి పూర్తిస్థాయిలో నిశితంగా పరిశీలించేందుకు 5 గంటల సమయం పట్టింది. ఈలోపు తాము పడిన ఇబ్బందులను ప్రయాణికులు 'ఈనాడు'కు వివరించారు. ఇంత ప్రక్రియ ఉంటుందా...: విమానం ల్యాండ్ అవ్వగానే, త్వరగా ఇమిగ్రేషన్ ప్రక్రియ పూర్తిచేసుకుని.. ఇళ్లకు, ఇతర గమ్యస్థానాలకు చేరదామనుకుంటున్న వారికి భద్రతా హెచ్చరికలు ఖంగు తినిపించాయి. తదుపరి విమానంలోని ప్రయాణికులను 10 మంది చొప్పున క్యాబిన్ బ్యాగేజీతో సహా కిందకు దిగమని సూచించారు. ప్రయాణికులు కిందకు వచ్చేసరికి ఆ సమీపంలోనే ఏడెనిమిది బస్సులు, ఫైర్ ఇంజిన్, పది వరకు అంబులెన్సులు, మొబైల్ స్కానింగ్ యూనిట్, జామర్ వంటివి కనిపించాయి. ఒక్కో ప్రయాణికుడి టికెట్, ఇతర ధ్రువీకరణ పత్రాలు పరిశీలించి, వారి క్యాబిన్ లగేజీని దూరంగా ఉంచారు. తనిఖీలు చేసిన వారిని బస్సుల్లోకి ఎక్కించారు. చెక్‌ఇన్ లగేజీని క్షుణ్నంగా తనిఖీ చేసి, బాంబు ఏమీ లేదని నిర్ధారించుకున్నాక.. బస్సుల్లో ఉన్న ప్రయాణికులను వాటిని తెచ్చుకునేందుకు అనుమతించారు. 212 మంది ప్రయాణికులు కావడంతో, విడతలుగా ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు 5 గంటల సమయం పట్టింది. కాలకృత్యాలు తీర్చుకునే మార్గమూ లేదు: ఉదయం 5.20 గంటలకు విమానం నుంచి ప్రయాణికులను కిందకు దించడం ప్రారంభించగా, మొత్తం తనిఖీలు పూర్తి చేసి, ఇమిగ్రేషన్ వద్దకు బస్సుల్లో తీసుకెళ్లేసరికి 10.30 అయ్యింది. విమానం నుంచి దించేయడంతో కాలకృత్యాలు తీర్చుకునే మార్గం లేక పిల్లలూ, పెద్దవారు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఆకతాయితనంతో, వ్యవస్థలపై ఆగ్రహంతో కొందరు చేస్తున్న బాంబు బెదిరింపుల వల్ల వందలమంది ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురికావాల్సి వస్తోంది. ప్రభుత్వ యంత్రాంగం కూడా తీవ్ర వ్యయ, ప్రయాసలకు లోను కావాల్సి వస్తోంది. ఇటువంటి బెదిరింపు కాల్స్‌ను నిరోధించేందుకు చర్యలు చేపడుతున్నామని అధికారులు చెబుతున్నా ఇవి ఆగడం లేదు. బాంబు బెదిరింపు ఉదంతంపై ఆర్‌జీఐఏ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## పుట్టపర్తికి ప్రధాని మోదీ రాక నేపథ్యంలో పటిష్ఠ ఏర్పాట్లు..

అమరావతి, నవంబర్ 10 : పుట్టపర్తి శ్రీ సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు ముమ్మరం చేసింది. ఈ ఉత్సవాలకు దేశ ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరుకానున్న నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈ నెల 19న ప్రధానమంత్రి, 22న రాష్ట్రపతి పుట్టపర్తి పర్యటన ఖరారైనందున భద్రతాపరమైన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలో మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) విజయానంద్, ఇతర ఉన్నతాధికారులతో సత్యసాయి శత జయంతి వేడుకల నిర్వహణపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని పనిచేయాలన్నారు. ప్రధాని, రాష్ట్రపతి సహా ఇతర ప్రముఖుల పర్యటనలో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. ఏర్పాట్ల పర్యవేక్షణకు మంత్రుల కమిటీ క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. పుట్టపర్తి పట్టణాన్ని సుందరంగా అలంకరించాలని,



పారిశుద్ధ్య నిర్వహణలో ఎక్కడా రాజీ పడొద్దని స్పష్టం చేశారు.

### భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు

సత్యసాయి మహాసమాధి దర్శనం కోసం దేశ, విదేశాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడటం అధికారుల ప్రథమ కర్తవ్యమని సీఎం అన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని, వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలు కేటాయించి, పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు రాకుండా చూడాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. భక్తుల కోసం అవసరమైనన్ని ఆర్టీసీ బస్సులను అందుబాటులో ఉంచాలన్నారు. ముందుజాగ్రత్త చర్యగా వైద్య సేవలను సిద్ధం చేయాలని, పుట్టపర్తి వ్యాప్తంగా 10 వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు.

* **రవాణా, ఇతర ఏర్పాట్లపై అధికారుల నివేదిక**

సీఎం ఆదేశాల మేరకు ఇప్పటికే చేపట్టిన చర్యలను అధికారులు సమావేశంలో వివరించారు. పారిశుద్ధ్య నిర్వహణ కోసం ప్రత్యేకంగా 250 మంది సిబ్బందిని నియమించామని, భక్తులకు తాగునీరు, ఆహారం, మరుగుదొడ్ల వంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసిందని, ఈ నెల 13 నుంచి డిసెంబర్ 1 వరకు 65 ప్రత్యేక రైళ్లతో సహా మొత్తం 682 రైళ్లను పుట్టపర్తికి నడుపుతున్నట్లు వివరించారు. పుట్టపర్తి రైల్వే స్టేషన్ నుంచి బస్ స్టేషన్‌కు భక్తుల సౌకర్యార్థం రోజుకు 20 బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు సవిత, సత్యకుమార్ యాదవ్, ఆనం రామనారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాద్, సీఎస్ విజయానంద్, డీజీపీ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మహాకవి అందెశ్రీ మృతికి కొత్తగూడెం బార్ అసోసియేషన్ సంతాపం



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : మహాకవి అందెశ్రీ మరణం పట్ల కొత్తగూడెం బార్ అసోసియేషన్ సంతాపం ప్రకటించి నివాళులర్పించింది. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సంతాప సభలో ఆయన మాట్లాడుతూ 'మాటలు, పాటలు, కవితా సంపుటాల' ద్వారా తెలంగాణ సమాజాన్ని మేల్కొలిపి, స్వరాష్ట్ర సాధన వైపు నడిపించిన మహానుభావుడు అందెశ్రీ అని కొనియాడారు. ఆయన సేవలు, కవిత్వం, తెలంగాణ పట్ల ఉన్న ప్రేమను ఈ సమాజం ఎప్పటికీ మరువదన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు జె. గోపికృష్ణ, ప్రధాన కార్యదర్శి భాగం మాధవరావు, కార్యవర్గ సభ్యులు కాసాని రమేష్, ఉప్పు వరుణ్, కే. చిన్నకృష్ణ, అడపాల పార్వతి, మాలోత్ ప్రసాద్, పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో రెండు పాడి గేదెలు మృతి

* **ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్న పాడి రైతు**





ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండలంలోని పోతుగల్ గ్రామానికి చెందిన పాడి రైతు పెంట సత్తయ్యకు చెందిన రెండు పాడి గేదెలు అనారోగ్యంతో మృతి చెందాయి. వీటి విలువ సుమారు 2లక్షల 50వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. వాటిపై ఆధార పడి తాను జీవనం కొనసాగిస్తున్నానని, పాడి గేదెల మృతితో తాను జీవనోపాధి కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సందర్శించి, తనకు జరిగిన నష్టంపై అంచనా వేయాలని, ప్రభుత్వం తరుపున తనకు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని వేడుకున్నారు.

## ఓట్ చోరీకి వ్యతిరేకంగా ఇల్లందు మున్సిపాలిటి 3వ వార్డ్ లో సంతకాల సేకరణ



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: ఓట్ చోరిని వ్యతిరేకిస్తూ ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోగల 3వ వార్డులో మాజీ కౌన్సిలర్ కొక్కు నాగేశ్వరావు ఆధ్యక్షతన నిర్వహించిన సంతకాల సేకరణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఇల్లందు నియోజకవర్గం శాసన సభ్యులు కోరం కనకయ్య పాల్గొని గడపగడపకు తిరుగుతూ ఓట్ చోరిని ప్రజలకు వివరిస్తూ సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం చేసిన ఓట్ చోరిని ప్రతి గడపకు కార్యకర్తలు చేరువేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు పార్లమెంట్ విపక్ష నేత రాహుల్ గాంధీ పక్క సమాచారంతో ఓట్ చోరిని బహిర్గతం చేశారన్నారు. బిజెపి పార్టీని కేంద్రంలో గద్దె దించే వరకు కార్యకర్తలందరూ కంకణ బద్దులై పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు, ఇల్లందు టౌన్ పార్టీ అధ్యక్షులు దొడ్డా డానియల్,మాజీ మున్సిపల్ చైర్మెన్లు యదలపల్లి అనసూర్య,దమ్మాలపాటి వెంకటేశ్వరావు,నాయకులు మడుగు సాంబ మూర్తి,బోళ్ళ సూర్యం,చిల్లా శ్రీనివాస్,హరిహక్షేతం చైర్మెన్ గందె సదానందం,టౌన్ ప్రధాన కార్యదర్శి ఎండీ జాఫర్,టౌన్ కార్యనిర్వహక అధ్యక్షులు సుదర్శన్ కోరి,వత్స వెంకన్న,పింగళి నరేష్,టౌన్ మహిళ అధ్యక్షురాలు గాలిపల్లిస్వరూప,నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గోన్నారు.

## నిజాంపేట్ లో ఘనంగా మహా అన్నప్రసాద కార్యక్రమం



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కార్తీక సోమవారం సందర్భంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిజాంపేట్ లో వెలిసినటువంటి శివాలయంలో మహా అన్నప్రసాద కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్ రెడ్డి గురు స్వామి ముఖ్య అతిథిగా పాల్గొని ఆలయాన్ని దర్శించుకుని అవతార కార్యక్రమంలో వారి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రెసిడెంట్ పితాని శ్రీనివాసరావు, లక్ష్మణ్, రమణ, రామచంద్రనాయక్, బాలకృష్ణ, దాని నాయుడు, ఆర్ రాజు, రాజు గౌడ్, ఈశ్వర్ రావు, రామకృష్ణ, శివ నాగరాజు యాదవ్, సుమతి,జయలక్ష్మి, జ్యోతి, లక్ష్మి, శైలజ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణాలు పోయాక స్పందిస్తారా..?

* **అధికారులకు ఎందుకు అంత నిర్లక్ష్యం..?**
* **పార్కులో పాము కలకలం పక్కనే ప్రభుత్వ పాఠశాల**
* **భయాందోళనలో స్థానికులు**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:వాకింగ్‌కి వచ్చి ఆరోగ్యం కాపాడుకోవాలనుకునే పెద్దలు, వ్యాయామం చేసేందుకు వచ్చే యువత, ఓపెన్ జిమ్‌లో కసరత్తులు చేసే మహిళలు - అందరి కంటే ఎక్కువ భయాందోళనలో ఇప్పుడు స్థానికులు. తెలంగాణ క్రీడా ప్రాంగణంలో విద్యార్థులు అక్షరాలు నేర్చుకునే పాఠశాల కూడా ఉండటంతో చిన్న పిల్లల ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.సోమవారం ఉదయం రామవరంలోని తెలంగాణ పార్కు కమ్ క్రీడా మైదానంలో పాము దర్శనమిచ్చి కలకలం రేపింది.మొదట పామును చూసిన కొందరు స్థానికులు అది "కొండచిలువా?" లేక "కట్లపామా?" అంటూ గందరగోళానికి గురయ్యారు. కొద్దిసేపటికే పిచ్చిమొక్కల్లో దాగి ఉన్న విషపూరిత రక్త పింజర పాముని గుర్తించిన స్నేక్ రెస్క్యూటివ్ సభ్యుడు సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం "ఈ పాము కాటు వేస్తే ప్రాణాలతో బయటపడటం చాలా కష్టం" అన్నారు.పార్కు చుట్టుపక్కల పిచ్చి మొక్కలు పెరిగి చిట్టడివిని తలపిస్తున్నాయి. నిధులు మంజూరైనప్పటికీ అధికారులు పనులు పూర్తి చేయకపోవడంతో పార్కు పరిస్థితి అధ్వాన్నంగా మారిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

* **"పిల్లలు పాముకాటుకు గురైతే బాధ్యత ఎవరిది?"**

అని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. పార్కు పక్కనే ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తున్నారు. చిన్న పిల్లలు ప్రతిరోజూ ఆడుకునే ఈ ప్రదేశంలో పాములు తిరగడం స్థానికుల్లో భయాన్ని రేకెత్తిస్తోంది.స్థానికులు వెంటనే పార్కులోని పిచ్చిమొక్కలను తొలగించి, శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని అధికారులు డిమాండ్ చేస్తున్నారు."తక్షణం చర్యలు తీసుకోకపోతే మెయిన్ గేట్‌కి తాళం వేసి, కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం" అని హెచ్చరించారు.కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ పార్కును అధికారులు పునరుద్ధరించి, ప్రజల వినియోగానికి అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

## ఏజెన్సీలో 100 శాతం ఉద్యోగాలు స్థానిక గిరిజనులకే ఇవ్వాలి

* **ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: షెడ్యూలు ప్రాంతం, ఏజెన్సీలో వంద శాతం ఉద్యోగాలు స్థానిక గిరిజనులకే ఇవ్వాలని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ రమేష్ నాయక్ డిమాండ్ చేశారు. జీవో నెంబర్.3ను తక్షణమే పునరుద్ధరించాలని, దీనిపై కేంద్ర, తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమవైఖరిని స్పష్టం చేయాలని కోరారు. సోమవారం కొత్తగూడెం బస్టాండ్ ఏరియాలో జరిగిన ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో రమేష్ నాయక్ మాట్లాడుతూ 5వ షెడ్యూల్ ప్రాంతం పరిరక్షణ సర్వ అధికారాలు గవర్నర్, రాష్ట్రపతికి ఉన్నాయని, ఏజెన్సీ ప్రాంత గిరిజనుల హక్కులు, ప్రయోజనాలు దెబ్బతీసే విధంగా సుప్రీంకోర్టు జీవో నెంబర్ 3ని రద్దు చేయడం వల్ల 5 సంవత్సరాలుగా నిరుద్యోగ స్థానిక గిరిజన యువత వేల ఉద్యోగాలు కోల్పోవడం జరిగిందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరుల ప్రభావం పెరిగి గిరిజన తెగలకు తీవ్ర నష్టం కలుగుతుందని ఆరోపించారు. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వాలు దీనిపై ప్రత్యేక చొరవ తీసుకొని ట్రైబల్ అడ్వైజరీ కమిటీని సమావేశపరిచి జీవో నెంబర్ 3 పునరుద్ధరణకై రాష్ట్ర ముఖ్యమంత్రి, గిరిజన ఎమ్మెల్యేలు, ఎంపీలు చొరవ తీసుకొని గవర్నర్ గవర్నర్ ఆర్డినెన్స్ జారీ చేసి, 9వ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తెలంగాణ ఆంధ్ర రాష్ట్రాల్లో గిరిజనులు ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గూగులోతు మోహన్ నాయక్, భూక్య హరిలాల్, గూగులోత్ నాగ, బోడ నగేష్, హథీరాం, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా మృత్యుంజయ హోమం...

* **పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు..**

ఆశీర్వచనం..తీర్థ ప్రసాదాలు అందజేసిన పురోహితులు

అందోలు, ప్రజాస్ఫూర్తి: అందోలు మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం వద్ద సోమవారం మృత్యుంజయ హోమం ఘనంగా జరిగింది. గ్రామానికి అందులపల్లి వంశీయుల గౌడ కులస్థుల ఆద్వర్యంలో మృత్యుంజయ హోమాన్ని నిర్వహించారు. మృత్యుంజయ హోమం వల్ల అకాల మరణాలు నివారణ, దీర్ఘాయువు కలుగుతుందని వివరిస్తూ పురోహితులు వారి చేతుల మీదుగా జరిపించారు. దంపతులు రమేశ్‌గౌడ్-సరప్వతి, అశోక్‌గౌడ్-అనుసుజ,శివ శంకర్‌గౌడ్-అనూష, కళ్యాణ్‌గౌడ్- అశ్విని దంపతులతో పాటు అరుణ్‌ప్రసాద్‌గౌడ్, సంపత్‌గౌడ్, కార్తీక్ గౌడ్, హరిక్రిష్ణ, శ్రీధర్, నిఖిల్ ల చేతుల మీదుగా మృత్యుంజయ హోమంలో ముఖ్యమైన శివుడికి అభిషేకం పూజలు జరిపించారు. కార్యక్రమంలో భాంగంగా గణపతి పూజ, నవగ్రహ ఆరాధన, మృత్యుంజయ హోమం, మృత్యుంజ పాష్పతం, అమ్మవారికి అభిషేకం, అలంకరణ వంటి కార్యక్రమాలను పురోహితులు ఆనంద్‌శర్మ, శాస్త్రోక్తంగా మంత్రోచ్ఛరణమ మధ్య నిర్వహించారు. హోమ కార్యక్రమంలో గ్రామానికి చెందిన మహిళ భక్తులతో పాటు చిన్నారులు పెద్ద ఎత్తున హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. జోగిపేట ఏయంసీ చైర్మెన్ ఎం.జగన్మోహన్‌రెడ్డి, డైరెక్టర్ మధుసుదన్‌రెడ్డి, మాజీ డైరెక్టర్ శేరి వెంకట్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ , మాజీ కౌన్సిలర్ రవిశంక్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు యాదగౌడ్, మాణిక్‌రెడ్డి, మాజీ ఎంపిటీసీలు టి.బాలయ్య, రాజిరెడ్డి, నాయకులు ఎం.క్రిష్ణ , బి.సంగమేశ్వర్, ప్రభాకర్‌రెడ్డి, రుక్మారెడ్డి, సంగమేశ్వర్‌గౌడ్, మణికంఠ గౌడ్, రవికుమార్ గౌడ్, రాజేష్‌గౌడ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



## డ్రగ్స్పై చైతన్యం ర్యాలీతో సందేశం

* **కొత్తగూడెం పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం పోలీసు శాఖ ఆధ్వర్యంలో "చైతన్యం - డ్రగ్స్‌పై యుద్ధం" పేరుతో విద్యార్థులు, యువతకు అవగాహన కల్పించే ర్యాలీ ఘనంగా నిర్వహించారు. చుంచుపల్లి జీవి మాల్ ఎదుట నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ఎస్ఆర్‌డీజీ స్కూల్ వద్ద ముగిసింది. ఈ కార్యక్రమానికి కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రహమాన్ నేతృత్వం వహించారు. ర్యాలీలో విద్యార్థులు "డ్రగ్స్‌కు నో చెప్పండి", "మాదకద్రవ్యాలు మన జీవితాన్ని నాశనం చేస్తాయి" అంటూ నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం నింపారు. ర్యాలీ అనంతరం డీఎస్పీ అబ్దుల్ రహమాన్ మాట్లాడుతూ, "డ్రగ్స్ వాడకం వ్యక్తిగత సమస్య మాత్రమే కాదు, అది సమాజాన్నీ దెబ్బతీసే ప్రమాదకర వ్యాధి. యువత భవిష్యత్తు సురక్షితంగా ఉండాలంటే డ్రగ్స్ దూరం చేయాలి. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తన, స్నేహిత వర్గం పట్ల అప్రమత్తంగా ఉండాలి" అని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మాదకద్రవ్యాల హానికర ఫలితాలపై అవగాహన పత్రాలను పంపిణీ చేశారు. ర్యాలీలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ రవికుమార్, ఎస్సై ఉమా, పోలీసు సిబ్బంది, స్థానిక విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూం ఇండ్ల పెండింగ్ పనులు పూర్తి చేయాలి

* **కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసిన నాయకులు, లబ్ధిదారులు**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండలంలోని గూడెం గ్రామంలో డబుల్ బెడ్ రూం ఇండ్లపెండింగ్ పనులు పూర్తి చేయాలని మాజీ ఎంపిటిసి చిట్నేని శ్రీనివాస రావు, టిఆర్ఎస్ మహిళా నాయకురాలు కుర్ర సావిత్రి విజ్ఞప్తి చేశారు. సోమవారం లబ్ధిదారులతో కలిసి వారు కలెక్టర్‌ను కలిశారు. గత ప్రభుత్వంలో గూడెం గ్రామంలో 48 డబుల్ బెడ్ రూంలు నిర్మించడం జరిగిందని, కానీ పనులు పూర్తి కాలేదని తెలిపారు. గతంలో కలెక్టర్, కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌ఛార్జి కేకే మహేందర్ రెడ్డి గ్రామానికి వచ్చి పనులు ప్రారంభించారని, అయినప్పటికీ పనులు పూర్తి కాలేదని తెలిపారు. పెండిగ్ పనులు పూర్తి చేయాలని ఈ సందర్భంగా డబుల్ బెడ్ రూం లబ్ధిదారులు విజ్ఞప్తి చేశారు. దీంతో స్పందించిన కలెక్టర్ పనులు పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

## అయ్యప్ప మాలదారులకు నిత్యాన్నదానం ప్రారంభం



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం వలిగొండ రోడ్డులోని శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయంలో అయ్యప్ప స్వామి నిత్య అన్నదానం కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ నాయకుడు బత్తుల విప్లవ్ కుమార్ గౌడ్ వాణి దంపతులు సోమవారం ప్రారంభించారు. అయ్యప్ప స్వామి మలాదారులకు అన్నదానం చేయడం వారి పూర్వ జన్మ సుకృతంగా, అదృష్టంగా భావించారు. వారి కుటుంబానికి అయ్యప్ప స్వామి ఆశీస్సులు ఏళ్లవేళలా ఉండాలని, ఆయురారోగ్యాలు, అష్ట ఐశ్వర్యాలు అయ్యప్ప స్వామి ప్రసాదించాలని మనసారా అయ్యప్ప స్వామి మాలదారులు, శివదీక్ష, హనుమాన్ దీక్ష మాలదారులు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అన్నదానం నిర్వాహకులు తొర్పునూరి నర్సింహ గౌడ్, సన్నిధానం గురుస్వామి చెరుకు అశోక్ గౌడ్, కళ్ళెం నాగరాజు గౌడ్, చెవగొని మహేష్ గౌడ్, స్వాములు మార్గం శేఖర్ యాదవ్, అందోజు సన్నిధ్ చారి, పోల్దాస్ రాజు, దాసరి మురళిస్వామి, బందారపు శివగౌడ్, చెరుకు చైతన్య, ఆలయం కమిటి సభ్యులు, చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిసర రాజకీయ నాయకులు, పారిశ్రామిక వేత్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సీబీసీ ప్రార్థన మందిరములో పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని మొగులమ్మ కాలనీలోని సీబీసీ ప్రార్థన మందిరములో పాస్టర్ శామ్యుల్ ఆధ్వర్యంలో నిర్వహించిన పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరై సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ క్రిస్టియన్ ఫెలోషిప్ సమావేశంలో పాస్టర్స్ అందరిని ఒకే వేదికమీద కలవడం ఆనందంగా ఉందని అన్నారు. విచ్చేసిన పాస్టర్లకు, సమావేశాన్ని ఏర్పాటు చేసిన నిర్వహికులకు శుభాకాంక్షలు తెలియచేశారు. రేవ పి ఇస్రాయిల్, సత్యరాజు, ఎం.దేవదాసు, జాన్ పాల్, బిషప్. టి. దేవానందం, స్టీవెన్, జైరజు, ఆర్పీ దాస్, మహేష్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అన్ని వసతులు కల్పించాలి

*** రాష్ట్ర మంత్రులు ఉత్తమ్, తుమ్మల**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం, పత్తి, సోయా, తదితర పంటల కొనుగోళ్ల కేంద్రాల నిర్వహణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పిస్తూ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌర సరఫరా శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం హైద్రాబాద్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సెక్రెటేరియట్ నుండి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు ,పౌర సరఫరాల, సహకార, సంబంధిత అధికారులతో ధాన్యం, కాటన్, సోయా, కొనుగోళ్ల కేంద్రాల నిర్వహణ తదితర అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి మంత్రులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ వెంటనే కేంద్రాలను ప్రారంభించాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే తరలించాలని సూచించారు. వాతావరణ పరిస్థితులను రైతులకు తెలియజేస్తూ అప్రమత్తంగా ఉంచాలన్నారు. కేంద్రాలలో ప్యాడీ క్లీనర్స్, మాచర్ మిషన్, మిషనరీస్, గన్ని సంచులు, తార్పాలిన్లు, లారీలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. వచ్చే మూడు నాలుగు వారాలలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. మిల్లర్లు, కాంట్రాక్టర్స్, హమాలీలు, అంశాలపై ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. పూర్తిస్థాయిలో అన్ని విభాగాలు సమన్వయంతో కలిసి పనిచేసే ధాన్యం సేకరణ కొనుగోళ్ల విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో రైతులకు సంబంధించిన ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, డిఆర్డిఓ విద్యా చందన, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, సహకార శాఖ అధికారి శ్రీనివాసరావు, డిఎం సివిల్ సప్లై త్రినాథ్ బాబు, మార్కెటింగ్ అధికారి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ రాష్ట్రవ్యాప్త బస్సు జాతను జయప్రదం చేయాలి

*** ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: సిపిఐ 100సంవత్సరాల ముగింపు ఉత్సవాల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే బస్సు జాతను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డిలు పిలుపునిచ్చారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం సిపిఐ కార్యాలయంలో సోమవారం సిపిఐ మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డిలు హాజరై మాట్లాడారు. డిసెంబర్ 26న ఖమ్మం నగరంలో పెద్ద ఎత్తున అఖిలభారత స్థాయి 100 సంవత్సరాల ముగింపు ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభ విజయవంతం కోసం రాష్ట్రవ్యాప్తంగా మూడు బస్సు జాతాలు నిర్వహించి విస్తృత ప్రచారం నిర్వహించనున్నామన్నారు. ఈ జాతాలలో రెండవ విడత బస్ జాత ఎమ్మెల్సీ నెల్లికండ్ సత్యం ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన గద్వాలలో ప్రారంభమై 19వ తేదీన చౌటుప్పల్ పట్టణానికి జాత చేరుతుందని, ఈ జాతకు పార్టీ శ్రేణులు శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున స్వాగతం పలకాలన్నారు. వంద సంవత్సరాల త్యాగాల చరిత్ర కలిగిన పార్టీ సిపిఐ అన్నారు. ఈ శతాబ్ద కాలంలో ఎన్నో పోరాటాలు ఎన్నెన్నో త్యాగాలు ఎంతోమంది రక్తతర్పణతో ఎన్నో విజయాలు సాధించి భారత దేశ రాజకీయ చరిత్రలో సిపిఐ తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని గుర్తు చేశారు. ఈ తరుణంలో నిర్వహించే సిపిఐ శతజయంతి ముగింపు ఉత్సవాలకు ప్రజలు శ్రేయోభిలాషులు అన్ని వర్గాల వారు సహకరించి విజయవంతం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి, మున్సిపల్ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, సహాయ కార్యదర్శి ఉడుత రామలింగం, ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండూరు వెంకటేష్, ఎల్లంకి మహేష్, టంగుటూరి రాములు, దాసరి అంజయ్య, రోషణగారి అంజయ్య, బద్దుల సుధాకర్, నీళ్ల బిక్షపతి, రొండి నర్సింహా, కడవేరు కౌసల్య, కుంటి పాపయ్య, బోయిని యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## హరీష్ రావుపై చర్యలు తీసుకోండి.. ఈసీకి కంప్లైంట్



తెలంగాణ బ్యూరో: బీఆర్ఎస్‌నేత, మాజీ మంత్రి హరీష్‌రావు ఎన్నికల నిబంధనలు ఉల్లఘిస్తూ ఓటర్లకు బల్క్‌సందేశాలు పంపారని పీసీసీ సభ్యులు రాజేష్‌కుమార్ తెలిపారు. పీసీసీ నేతలు రాఘవేంద్ర, లింగం యాదవ్‌తో కలిసి సోమవారం చీఫ్ ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసు బెటాలియన్ పనిచేస్తూ ఉద్యోగులకు కాన్ఫరెన్స్ కాల్‌నిర్వహించారని తెలిపారు. ఎన్నికల సమయానికి 48 గంటలలోపు ఎలాంటి ప్రచారం చేయరాదనే నిబంధనలు పాటించలేదన్నారు. ఎన్నికల్లో ఓటర్లను మభ్యపెట్టేందుకు ప్రయత్నాలు చేశారని, అతని చర్యలు తీసుకోవాలని కోరారు.

## సంక్రాంతి రిజర్వేషన్లు ఫుల్.. రేపట్నుంచి తెరచుకోనున్న వీకెండ్ విండో బుకింగ్



సంక్రాంతి పండుగ వస్తుందంటే చాలు.. దేశంలో తెలుగువాళ్లు ఎక్కడ ఉన్నా సొంతూరికి చేరుకోవాల్సిందే. కానీ.. ఉన్న చోటు నుంచి సొంతూరికి ప్రయాణమే చాలా కష్టం బస్సులు, రైళ్లు, ఆఖరికి విమానాలు కూడా ఫుల్ అయిపోతాయి. టోల్ ప్లాజాల వద్ద కిలోమీటర్ల మేర కార్లు, టూవీలర్లు దర్శనమిస్తాయి. 1520, ఆపైన ఉండే స్లీపర్ కోచ్ లు ఉండే రైళ్లలో కాలు పెట్టేందుకు కూడా ఖాళీ కనిపించదు. దీనిని బట్టి రద్దీ ఏ స్థాయిలో ఉంటుందో ఊహించండి. పేరుకు రిజర్వేషన్ బోగీలే కానీ.. జనరల్ కంపార్ట్మెంట్లనే తలపిస్తాయి. 2026 జనవరిలో సంక్రాంతి వీకెండ్ తర్వాత వస్తోంది. జనవరి 12, 16 సెలవులు పెడితే.. ఈసారి సంక్రాంతికి సొంతూరిలో 9 రోజులు ఉండే ఛాన్స్ ఉంది. దీంతో సంక్రాంతి రిజర్వేషన్ల కోసం ప్రయాణికులు ఈగర్ గా వెయిట్ చేస్తున్నారు. జనవరి 9 శుక్రవారం కాగా.. ఇప్పటికే చాలా వరకూ టికెట్లు బుక్కైపోయి.. రిగ్రెట్ చూపిస్తోంది. వందేభారత్ రైలుకైనా వెళ్దామంటే.. ప్యాసింజర్లకు వెయిటింగ్ లిస్ట్ కనిపిస్తోంది. సికింద్రాబాద్ వైజాగ్ మధ్య నడిచే గోదావరి ట్రైన్ రిజర్వేషన్, వెయిటింగ్ కూడా పూర్తయి రిగ్రెట్ పడింది. గరీబ్ రథ్, ఫలక్ నుమా సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్, మహబూబ్ నగర్ విశాఖ సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్, విశాఖ ఎక్స్ ప్రెస్ లు కూడా రిగ్రెట్ చూపిస్తున్నాయి. స్లీపర్, ఫస్ట్ క్లాస్ ఏసీ, సెకండ్ క్లాస్ ఏసీ అనే తేడా లేదు. టికెట్ బుక్కైతే చాలన్న చందంగా.. సంక్రాంతి ముందు వీకెండ్ టికెట్స్ హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి.





## గంజాయి హాట్ స్పాట్స్ ను తరచుగా తనిఖీ చేయాలి

*** సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలి**

*** పాల్వంచ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: పాల్వంచ పోలీస్ స్టేషన్ ను సోమవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సందర్శించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న పోలీస్ అధికారులు , సిబ్బందికి పలు సూచనలు చేశారు.పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని,వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు.అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గంజాయి హాట్ స్పాట్లను నిరంతరం తనిఖీ చేయాలని సూచించారు.ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా నిత్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. పెట్రోలింగ్,బ్లూ కోల్ట్స్ వాహనాలతో సంచరిస్తూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.పోలీస్ అధికారులు,సిబ్బంది ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు వహించాలని, వృత్తిపరమైన , వ్యక్తిగత సమస్యలను ఎలాంటివి తలెత్తినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్ ,సీఐ సతీష్ ,ఎస్సైలు సుమన్, జీవన్ కుమార్, కళ్యాణి, సిబ్బంది పాల్గొన్నారు.





## భగత్ సింగ్ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులుగా

# నరేందర్ గౌడ్,ప్రతాపరెడ్డి లు

జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి: గాజులరామారం సర్కిల్ చింతల్ డివిజన్ భగత్ సింగ్ నగర్ సంక్షేమ సంఘం ఎన్నికలు ఆదివారం స్థానిక సంక్షేమ సంఘ భవనం లో జరిగాయి.ఈ ఎన్నికల్లో అధ్యక్షులు గా పచ్చిమట్ల నరేందర్ గౌడ్, ఈ సామ్రాట్ లు, ప్రధాన కార్యదర్శిగా ప్రతాప్ రెడ్డి, కోడి తిరుపతి లు పోటీ పడ్డారు. ఈ ఎన్నికల్లో మొత్తం ఓట్లు 1712 ఉండగా అధ్యక్ష బరిలో ఉన్న పచ్చిమట్ల నరేందర్ గౌడ్ కు 979 ఓట్లు రాగా సమీప ప్రత్యర్థి ఈ.సామ్రాట్ కు 695 వచ్చాయి. ఇందులో చెల్లని ఓట్లు 38 అని, ప్రధాన కార్యదర్శిగా పోటీ చేసిన ఎస్.ప్రతాప్ రెడ్డి కి 995 ఓట్లు రాగ సమీప ప్రత్యర్థి కోడి తిరుపతి కి 679 వచ్చాయి.ఇందులో చెల్లని ఓట్లు 38 వచ్చాయని 285 మెజార్టీతో పచ్చిమట్ల నరేందర్ గౌడ్ అధ్యక్షుడిగా ప్రధాన కార్యదర్శిగా ఎస్. ప్రతాపరెడ్డి 316 మెజార్టీతో గెలుపొందారని ఎన్నికల రిటర్నింగ్ అధికారులు వివరించారు.ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులుగా గెలుపొందిన నరేందర్ గౌడ్, ప్రతాప్ రెడ్డిలు మాట్లాడుతూ తమపై నమ్మకంతో గెలిపించినందుకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. బస్తీ అభివృద్ధి కోసం తాము ఎల్లవేళలా అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు బస్తీలో మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తామన్నారు. గెలిచిన అధ్యక్ష కార్యదర్శులు నరేందర్ గౌడ్, ప్రతాపరెడ్డి లను అడ్ హక్ కమిటీ సభ్యులు, స్థానికులు శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అడ్ హక్ కమిటీ సభ్యులు ఎల్లారెడ్డి,బీసు వెంకటేశం గౌడ్,బత్తిని శ్రీధర్ గౌడ్,మడ్డి వెంకటేశ్వర్లు గౌడ్, వరదరాజు, దేవయ్య, సుభాష్, భూమయ్య, వెంకటేశం, ఇస్మాయిల్, మూర్తి, ఆంజనేయులు, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## PM కిసాన్ లిస్టులో మీ పేరు లేదా? కారణం ఇదే



రైతులకు ఏడాదికి ఒక ఎకరానికి రూ.6 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించే PM కిసాన్ సమ్మాన్ నిధి పథకం గురించి తెలిసిందే. అయితే ఇటీవల ఈ పథకం కింద లబ్ది పొందుతున్న లక్షలాది మంది రైతులను తొలగించారనే భారీగా ఆరోపణలు వచ్చాయి. అయితే ఈ ప్రచారంపై కేంద్ర ప్రభుత్వం వివరణ ఇచ్చింది. PM కిసాన్ సమ్మాన్ నిధి పథకం గైడ్ లైన్స్ ప్రకారం.. 2019 ఫిబ్రవరి 1 తర్వాత భూమి కొన్న వారికి ఈ స్కీమ్ వర్తించదని వివరణ ఇచ్చింది. అలాగే ఒకే ఫ్యామిలీ నుంచి భర్త, భార్య, పిల్లలు వేర్వేరుగా లబ్ది పొందుతున్నట్టు గుర్తించామని, అలాంటి వారికి తాత్కాలికంగా ఈ పథకాన్ని నిలిపివేశామని స్పష్టం చేసింది. అయితే వీరందరికీ మరోసారి ఫిజికల్ వెరిఫికేషన్ నిర్వహిస్తామని, అందులో అర్హులని తేలితే మళ్ళీ జాబితాలో చేర్చుతామని తెలిపింది. అయితే అనర్హులని తేలితే ఇప్పటివరకు లబ్ది పొందిన మొత్తాన్ని తిరిగి కట్టేలా ఆదేశాలు జారీ చేస్తామని పేర్కొంది.

## సీఎం సహాయనిధి.. నిరుపేదలకు వరం

*** చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకోలేని నిరుపేదల పాలిట సీఎం సహాయనిధి వరం లాంటిదని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య అన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను చౌటుప్పల్ మున్సిపల్ పరిధి లక్కారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం అందజేశారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డులకు చెందిన ఏడుగురికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.3,90,500ల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఉబ్బు వెంకటయ్య మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు ఈ పథకం ద్వారా ఆర్థిక సాయం అందుతుందన్నారు. నిరుపేదలు సీఎం సహాయనిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్, శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ చైర్మన్ బొబ్బిళ్ళ మురళి, బత్తుల విప్లవ్ కుమార్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పబ్బు శ్రీకాంత్ గౌడ్, పాక చిరంజీవి, ఎస్. కె జానీ బాబు, వర్కాల కుమార్, మాదని గోపాల్, తొర్పునూరి రవి గౌడ్, పస్తం గంగారాములు పెద్దగొని రమేష్ గౌడ్, మలిగె మల్లేష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో

# కొత్త మైలురాయి



తెలంగాణ బ్యూరో : రాష్ట్రం ధాన్యం కొనుగోళ్లలో కొత్త మైలురాయిని అధిగమించిందని, ఖరీఫ్ సీజన్‌లో 8.54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గత సంవత్సరం ఇదే సమయంలో కొనుగోలు చేసిన 3.94 లక్షల మెట్రిక్ టన్నుల కంటే రెండింతలు ఎక్కువ సేకరణ చేసినట్లు వెల్లడించారు. సోమవారం సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు , పౌర సరఫరాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. వాతావరణ ప్రతికూల పరిస్థితుల దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ధాన్యం కొనుగోళ్లపై తప్పుడు ప్రచారాన్ని అరికట్టాలని ఆదేశించారు. రాష్ట్రం ధాన్యం ఉత్పత్తి, కొనుగోళ్లలో చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో రికార్డు నెలకొల్పిందని తెలిపారు. శంలో తొలిసారిగా ఒక రాష్ట్ర ప్రభుత్వం ఒకే ఖరీఫ్ సీజన్‌లో 80 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించుకుందన్నారు. ఇది తెలంగాణ వ్యవసాయ రంగ బలాన్ని, రైతుల పట్ల మా ప్రభుత్వ నిబద్ధతను ప్రతిబింబిస్తుందన్నారు. ఇప్పటి వరకు 3.95 లక్షల మెట్రిక్ టన్నుల సన్నాలు, 4.59 లక్షల మెట్రిక్ టన్నుల పెద్ద ధాన్యం కొనుగోలు చేసినట్లు, కేంద్రాలకు ధాన్యం అమ్మిన రైతుల సంఖ్య గత సంవత్సరం 55,493 మందిగా ఉండగా, ఈ ఏడాది 1,21,960 మందికి చేరిందని చెప్పారు. మొత్తం ధాన్యం కొనుగోలు విలువ రూ. 2,041.44 కోట్లు కాగా, ఇది గత సంవత్సరం రూ. 915.05 కోట్లతో పోలిస్తే రెట్టింపు ఉందన్నారు. ఇందులో రూ. 832.90 కోట్లు ఇప్పటికే రైతులకు చెల్లించగా, మిగిలిన రూ. 1,208.54 కోట్లు ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఓపీఎంఎస్) ద్వారా నమోదు తర్వాత 48 గంటల్లో చెల్లించనున్నట్లు తెలిపారు.

# కేటీఆర్‌పై ఎఫ్ఐఆర్.. ఆ సెక్షన్లు కేసుకు సరిపోలడం లేదన్న హైకోర్టు

* **తనపై నమోదైన కేసును కొట్టివేయాలని హైకోర్టులో కేటీఆర్ పిటిషన్**
* **రాజకీయ కక్షల కారణంగానే కేసు నమోదు చేశారని కోర్టుకు తెలిపిన కేటీఆర్**
* **ఎన్నికల కోడ్ ఉల్లంఘించినందుకే కేసు నమోదు చేసినట్లు తెలిపిన పోలీసులు**

హైదరాబాద్ నగరంలోని సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు నేడు విచారణ జరిపింది. ఈ సందర్భంగా ఎఫ్ఐఆర్‌లో నమోదు చేసిన సెక్షన్లు ఈ కేసుకు సరిపోవడం లేదని హైకోర్టు



వ్యాఖ్యానించింది. తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. రాజకీయ కక్షల కారణంగానే ఈ కేసు నమోదు చేశారని కేటీఆర్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. అయితే, ఎన్నికల కోడ్ ఉల్లంఘించినందుకే కేసు నమోదు చేసినట్లు పోలీసుల తరపు న్యాయవాది వాదించారు. ఎలాంటి అనుమతులు లేకుండా అమరవీరుల స్మారకం వద్ద గోరటి వెంకన్నను కేటీఆర్ ఇంటర్వ్యూ చేశారని, అందులో బీఆర్ఎస్‌కు లబ్ధి చేకూరేలా అంశాలు ఉన్నాయని వాదనలు వినిపించారు. అంతేకాకుండా, అనుమతి లేకుండా డ్రోన్ ఎగురవేశారని తెలిపారు. ఇరువైపుల వాదనలు విన్న హైకోర్టు, ఎఫ్ఐఆర్‌లో నమోదు చేసిన సెక్షన్లు ప్రస్తుత కేసుకు సరిపోవడం లేదని వ్యాఖ్యానిస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

## రిజర్వేషన్ల సాధనకు 'హలో బీసీ.. చలో ఢిల్లీ': ఆర్.కృష్ణయ్య



హైదరాబాద్: తెలంగాణ ఉద్యమం తరహాలో బీసీ ఉద్యమాన్ని జాతీయ స్థాయిలో తీవ్రతరం చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. సోమవారం బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి బానాల అజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ల సాధన కోసం నిర్వహించనున్న 'హలో బీసీ.. చలో ఢిల్లీ' కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ నెల 10న ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో బీసీ డిమాండ్లపై నిర్వహిస్తున్న సదస్సులో తెలంగాణ, ఏపీ, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రానికి చెందిన పలువురు నేతలు పాల్గొంటారన్నారు. ఓబీసీ ప్రధానిగా ఉన్న ఈ సమయంలోనే బీసీ హక్కులను సాధించుకోవాలన్నారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్: కిషన్‌రెడ్డి

సికింద్రాబాద్: శంషాబాద్ విమానాశ్రయం మాదిరిగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను తీర్చిదిద్దాలనేది తన ఆకాంక్ష అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలించిన అనంతరం.. మీడియాతో ఆయన మాట్లాడారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను మెట్రో మార్గంతో అనుసంధానం చేస్తున్నట్లు చెప్పారు. "



రూ.715 కోట్లతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు సాగుతున్నాయి. స్టేషన్‌ను 1.65 లక్షల చ.మీ మేర కొత్తగా నిర్మిస్తున్నాం. ఈ స్టేషన్‌కు నిత్యం 1.97లక్షల ప్రయాణికులు వస్తుంటారు. 2.70లక్షల మంది ప్రయాణికుల అవసరాలకు తగినట్లు నిర్మిస్తున్నాం. నడుస్తున్న రైళ్లు, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా పనులు చేయాల్సి వస్తోంది. ఈ స్టేషన్‌లో 26 లిఫ్టులు, 32 ఎస్కలేటర్లు ఉంటాయి. రైల్వేస్టేషన్ కోసమే ప్రత్యేకంగా 2 సబ్‌స్టేషన్ల నిర్మాణం జరుగుతోంది. 5 మెగావాట్ల సౌరవిద్యుత్ ప్లాంటు కూడా ఏర్పాటు చేస్తున్నాం. వచ్చే ఏడాది డిసెంబర్‌లోపు ప్రధాని మోదీ చేతుల మీదుగా ఆధునిక సికింద్రాబాద్ స్టేషన్‌ను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం"అని కిషన్‌రెడ్డి తెలిపారు.

## వచ్చే ఏడాది నుండి మోడల్ స్కూళ్లలో 5 వ తరగతిలో ప్రవేశాలు



రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో ప్రవేశ విధానంలో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. ప్రస్తుత విద్యా సంవత్సరం వరకు 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు మాత్రమే ప్రవేశాలు నిర్వహిస్తోంది. కానీ వచ్చే విద్యా సంవత్సరం నుండి 5వ తరగతిలో కూడా అడ్మిషన్లు కల్పించాలని పాఠశాల విద్యాశాఖ ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. తద్వారా, మోడల్ స్కూళ్లను 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యను అందించే పూర్తిస్థాయి సంస్థలుగా మార్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రభుత్వ ఆమోదం అనంతరం దీనిపై త్వరలోనే అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. ఈ నిర్ణయం అమలులోకి వస్తే, గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే (5వ తరగతి) నాణ్యమైన, నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావడానికి అవకాశం ఉంటుందని విద్యా నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీనికి సంబంధించిన విధివిధానాలు, సీట్ల కేటాయింపు, ప్రవేశ పరీక్షల నిర్వహణపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. కాగా ఇప్పటివరకు రాష్ట్రంలో పలుచోట్ల మోడల్ స్కూల్స్ లో అడ్మిషన్లు ప్రతిఏటా పెరుగుతున్నాయి.

## వైద్యుల నిర్లక్ష్యం..

### నల్గొండ వినియోగదారుల ఫోరం సంచలన తీర్పు

నార్కట్‌పల్లి రూరల్: నార్కట్‌పల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి యాజమాన్యానికి నల్గొండ జిల్లా వినియోగదారుల ఫోరం బిగ్ షాక్ ఇచ్చింది. ఓ మహిళకు నిర్లక్ష్యంగా వైద్యం చేసి, ఆమె ప్రాణాలు బలిగొన్న కేసులో బాధిత కుటుంబానికి రూ.కోటి పరిహారం చెల్లించాలని ఆదేశించింది. నెల రోజుల్లో ఆ డబ్బు చెల్లించకపోతే 9శాతం వడ్డీతో ఇవ్వాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. వివరాల్లోకి వెళ్తే.. నల్గొండ జిల్లా చిట్యాల మండలం ఆరెగూడెం గ్రామానికి చెందిన స్వాతిని 2018 జులై 9న డెలివరీ కోసం కుటుంబ



సభ్యులు నార్కట్‌పల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. జులై 13 రాత్రి ఆమెకు సర్జరీ చేసిన వైద్యులు.. రెండు సార్లు మత్తు మందు ఇవ్వడంతో వైద్యం వికటించి.. 14న స్వాతి మృతి చెందారు. దానిని కప్పిపుచ్చుకునేందుకు వైద్యులు సినిమా రేంజ్‌లో సీన్ క్రియేట్ చేసి.. తమ తప్పులేదని నిరూపించుకునేందుకు ప్రయత్నించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేయగా.. పలుమార్లు విచారణ చేపట్టిన ఫోరం తాజాగా తీర్పు వెలురించింది. బాధితుల తరపున ప్రముఖ న్యాయవాది మేరెడ్డి నర్సింహారెడ్డి వాదనలు వినిపించారు.

## సంస్థ మనుగడ కోసం సహకరించండి..

### 39వ నిర్మాణాత్మక సమావేశంలో సింగరేణి సీఎండీ



అంతర్జాతీయ సంస్థగా ఎదుగుతున్న సింగరేణికి సుస్థిర భవిష్యత్ అందించడానికి ప్రతి ఉద్యోగి భాగస్వామిగా ఉండాలని సింగరేణి సీఎండీ ఎన్ బలరాం కోరారు. పని సంస్కృతిని మెరుగుపరుస్తూ ఉద్యోగులు తమకు కేటాయించిన షిఫ్టులో 8 గంటల పూర్తి సమయాన్ని సంస్థ కోసం పనిచేసేందుకు గుర్తింపు కార్మిక సంఘం సహకారం అందించాలని ఆయన కోరారు. సోమవారం హైదరాబాద్ సింగరేణి భవన్ లో గుర్తింపు కార్మిక సంఘం అయిన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ తో జరిగిన 39వ నిర్మాణాత్మక సమావేశంలో సీఎండీ మాట్లాడారు. బొగ్గు రంగంలో పోటీని తట్టుకునేందుకు బొగ్గు ధరలను తగ్గించామని, ఈ నేపథ్యంలో ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం అనివార్యమని, అప్పుడే సంక్షేమ కార్యక్రమాలను కూడా కొనసాగించడానికి, ఉపాధి కల్పనకు అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. ఉత్పత్తి ఖర్చు తగ్గించాలంటే ఉద్యోగులు పూర్తి పని గంటలు సద్వినియోగం చేస్తూ యంత్రాలను పూర్తిగా వినియోగించాలన్నారు. విధులకు గైర్హాజరు అవుతున్న కార్మికులు విధులకు హాజరయ్యేలా అవగాహన కల్పించాలని, తద్వారా క్రమశిక్షణను పెంచడం సాధ్యమవుతుందన్నారు. సింగరేణి భవిష్యత్తులో 10 రాష్ట్రాల్లో కార్యకలాపాలు నిర్వహించేలా విస్తరణ ప్రణాళికలు రూపొందించుకొని ముందుకు సాగుతుందన్నారు. బొగ్గు రంగానికే పరిమితమైన సంస్థను 5 వేల మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి చేసేలా తీర్చిదిద్దేందుకు వీలుగా సింగరేణి గ్రీన్ ఎనర్జీ, విశ్వవ్యాప్తంగా క్రిటికల్ మినరల్స్ అన్వేషణ, మైనింగ్ కోసం సింగరేణి గ్లోబల్ లిమిటెడ్ కంపెనీలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. సింగరేణిలో ఉన్న 40 వేల మంది ఉద్యోగులు, సంస్థపై ఆధారపడిన 30 వేల మంది కాంట్రాక్టు కార్మికుల భవిష్యత్ దృష్ట్యా కొత్త బొగ్గు గనులను వేలంలో దక్కించుకోవడానికి కృషి చేస్తున్నామని, తద్వారా సింగరేణికి మరో వందేళ్ల భవిష్యత్తు ఉంటుందన్నారు.

* **300 కోట్ల వ్యయంతో వెయ్యి క్వార్టర్స్ నిర్మాణం..**

సింగరేణి ఉద్యోగులకు దేశంలోనే ఏ కంపెనీలో లేని విధంగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని, వీటిని మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సీఎండీ తెలిపారు. ఉద్యోగులకు విశాలమైన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణం కోసం రూ.300 కోట్లకు పైగా వెచ్చించి గోదావరిఖని, శ్రీరాంపూర్, మణుగూరు, కొత్తగూడెం, భూపాలపల్లి తదితర ప్రాంతాల్లో వెయ్యి క్వార్టర్స్ నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అలాగే అత్యాధునిక వైద్య సేవలు అందించడానికి గోదావరిఖనిలో వచ్చే రెండు నెలల్లో క్యాథ్ ల్యాబ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. హైదరాబాద్ లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు కోసం చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఉద్యోగుల పిల్లలకు జాతీయ స్థాయి విద్యా బోధనను అందించేందుకు ఇప్పటికే రామగుండం 2 ఏరియాలో సీబీఎస్ఈ స్కూల్ ప్రారంభించామని, ఇతర ప్రాంతాల్లోనూ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

## ఢిల్లీలో పేలుడు.. హైదరాబాద్‌లో హై అలర్ట్

హైదరాబాద్: ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు ఘటనతో దేశమంతా ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఎర్రకోట మెట్రోస్టేషన్ సమీపంలో కారులో పేలుడు సంభవించి.. 8 మంది మృతి చెందగా, పలువురికి గాయాలయ్యాయి. ఎర్రకోట పరిసర ప్రాంతాల్లో భీతావహ వాతావరణం నెలకొంది. దీంతో ఢిల్లీలో హైఅలర్ట్ ప్రకటించారు. ఎన్ఐఏ బృందాలు రంగంలోకి దిగాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీ సహా పలు నగరాలను కేంద్ర హోంశాఖ అప్రమత్తం చేసింది. ముంబయి, హైదరాబాద్, కోల్‌కతా, బెంగళూరు తదితర నగరాల్లో హైఅలర్ట్ ప్రకటించింది. తాజా పరిస్థితుల నేపథ్యంలో హైదరాబాద్ పోలీసులు, ఉన్నతాధికారులు



అప్రమత్తమయ్యారు. ముమ్మర తనిఖీలు సాగిస్తున్నారు. ఢిల్లీ పేలుళ్ల దృష్ట్యా నగరంలో అలర్ట్ ప్రకటించినట్లు హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. పలుచోట్ల తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

## సిటీ ట్రైనింగ్ సెంటర్‌కు శంకుస్థాపన..

### భరోసా, కమాండ్ కంట్రోల్ సెంటర్‌లను ప్రారంభించిన డీజీపీ




రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మేడిపల్లిలో నిర్మించనున్న సిటీ ట్రైనింగ్ సెంటర్ (సీటీసీ)కు డీజీపీ బి.శివధర్ రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. కమిషనరేట్ పరిధిలోని సరూర్ నగర్‌లో భరోసా సెంటర్, కమాండ్ కంట్రోల్ సెంటర్ నూతన భవనాలకు ప్రారంభోత్సవం చేశారు. రాచకొండ పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు ఆధ్వర్యంలో మేడిపల్లిలో సమావేశంలో డీజీపీ మాట్లాడుతూ.. దివీస్ లేబరేటరీస్ లిమిటెడ్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులతో సిటీ ట్రైనింగ్ సెంటర్ ను నిర్మించడానికి ముందుకు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. యంగ్ ఇండియా పోలీస్ స్కూల్లో పోలీస్ సిబ్బంది పిల్లలతో పాటు సాధారణ ప్రజలకు కూడా 50% సీట్లను కేటాయించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి సూచించినట్లు తెలిపారు. సైబర్ క్రైమ్ నేరాలను అరికట్టేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోను బలోపేతం చేసి, వారికి అవసరమైన సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందన్నారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు "అరైవ్, అలైవ్ " పేరుతో డిసెంబర్ లో వాహనదారులకు, డ్రైవర్లకు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నామని తెలిపారు. రాచకొండ కమిషనరేట్ నూతన భవనం కోసం దాదాపు 50 ఎకరాలకు పైగా భూమిని ప్రభుత్వం కేటాయించేందుకు మాజీ శాసనసభ్యులు ఎం.సుధీర్ రెడ్డి కృషి చేసినందుకు ఆయనకు డీజీపీ కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఢిల్లీకి బయల్దేరిన బండి సంజయ్



ఢిల్లీ పేలుడు ఘటనతో కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దిగ్భ్రాంతికి గురయ్యారు. విషయం తెలిసిన వెంటనే ఢిల్లీ పోలీస్ కమిషనర్, కలెక్టర్‌లతో ఫోన్‌లో మాట్లాడారు. పరిస్థితిపై ఆరా తీశారు. హైదరాబాద్ నుంచి ఢిల్లీకి బయల్దేరి వెళ్లనున్నారు. పేలుడు ఘటనలో గాయపడిన వారిని ఆస్పత్రిలో పరామర్శించనున్నారు. అనంతరం ఎర్రకోట వద్దకు వెళ్లి పరిశీలించనున్నారు. మరోవైపు ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు ఘటనతో దేశమంతా ఒక్కసారిగా ఉలిక్కిపడింది. పేలుడు ధాటికి 10 మంది మృతి చెందగా, 30 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ సహా పలు నగరాలను కేంద్ర హోంశాఖ అప్రమత్తం చేసింది. ముంబై, హైదరాబాద్, కోల్‌కతా, బెంగళూరు తదితర నగరాల్లో హైఅలర్ట్ ప్రకటించింది. తాజా పరిస్థితుల నేపథ్యంలో హైదరాబాద్ పోలీసులు, ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. ముమ్మర తనిఖీలు సాగిస్తున్నారు.

# గతంలోనూ ఎర్రకోట సమీపంలో పేలుళ్లు.. ఢిల్లీలో ప్రధాన ఘటనలివే..!

ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో కారులో పేలుడు ఘటనతో దేశ రాజధాని ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఈ ఘటనలో ఇప్పటివరకు 8 మంది మృతి చెందగా.. పలువురు గాయపడినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. ఎర్రకోట ట్రాఫిక్ సిగ్నల్ వద్ద వాహనంలో పేలుడు సంభవించినట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీలో పోలీసులు హైఅలర్ట్ ప్రకటించారు. ఢిల్లీ ఎర్రకోట సమీపంలో గతంలో 2000, 1997లోనూ పేలుళ్లు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలోనే గతంలో దేశ రాజధాని నగరంలో చోటుచేసుకున్న ప్రధాన పేలుడు ఘటనలను ఒకసారి పరిశీలిస్తే..



* జనవరి 29, 2021: ఢిల్లీలోని ఇజ్రాయెల్ రాయబార కార్యాలయం సమీపంలో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు.
* ఫిబ్రవరి 2, 2012: ఢిల్లీలోని హై సెక్యూరిటీ ప్రాంతంలో బాంబు దాడిలో ఇజ్రాయెల్ రాయబార కార్యాలయానికి చెందిన ఓ కారు ధ్వంసమైంది. ఈ ఘటనలో వాహనంలోని ఓ మహిళ తీవ్రంగా గాయపడ్డారు.
* సెప్టెంబరు 7, 2011: ఢిల్లీ హైకోర్టు ప్రవేశ ద్వారం వద్ద రిసెప్షన్ ప్రాంతంలో బ్రీఫ్‌కేస్‌లో ఉంచిన శక్తిమంతమైన బాంబు పేలింది. 15 మంది మృతి చెందగా, 67 మందికిపైగా గాయపడ్డారు.
* మే 25, 2011: ఢిల్లీ హైకోర్టు వెలుపల కారు పార్కింగ్‌లో స్వల్ప పేలుడు ఘటన చోటుచేసుకుంది. ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు.
* సెప్టెంబరు 27, 2008: కుతుబ్ మినార్ సమీపంలోని మెహ్రౌలీ పూల మార్కెట్‌లో పేలుడు సంభవించింది. ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, 21 మంది గాయపడ్డారు.
* సెప్టెంబరు 13, 2008: వరుస పేలుళ్లతో ఢిల్లీ దద్దరిల్లింది. కన్నాట్ ప్లేస్, కరోల్ బాగ్‌లోని గఫార్ మార్కెట్, గ్రేటర్ కైలాష్‌లోని ఎంబ్లాక్ మార్కెట్‌లలో 45 నిమిషాల వ్యవధిలో ఐదు వరుస పేలుళ్లు చోటుచేసుకున్నాయి. 25 మంది మరణించారు. 100 మందికిపైగా గాయపడ్డారు.
* ఏప్రిల్ 14, 2006: పాత ఢిల్లీలోని జామా మసీదు ప్రాంగణంలో రెండు పేలుళ్లలో దాదాపు 14 మంది గాయపడ్డారు.
* అక్టోబరు 29, 2005: ఢిల్లీలోని సరోజినీ నగర్, పహాడ్‌గంజ్ మార్కెట్లతోపాటు గోవింద్‌పురి ప్రాంతంలో ఓ బస్సులో జరిగిన పేలుళ్లలో 59 మందికి పైగా మరణించారు. పలువురు విదేశీయులు సహా 100 మందికి పైగా క్షతగాత్రులయ్యారు.
* మే 22, 2005: ఢిల్లీలోని రెండు సినిమా హాళ్లలో చోటుచేసుకున్న వరుస పేలుళ్లలో ఒకరు మరణించగా, 60 మంది గాయపడ్డారు.
* జూన్ 18, 2000: ఎర్రకోట సమీపంలో రెండు శక్తిమంతమైన బాంబు పేలుళ్లు చోటుచేసుకున్నాయి. ఎనిమిదేళ్ల బాలిక సహా ఇద్దరు మృతి చెందారు. 10 మందికిపైగా గాయపడ్డారు.
* జులై 26, 1998: అంతర్రాష్ట్ర బస్ టెర్మినల్‌లోని కశ్మీరీ గేట్ వద్ద ఆగి ఉన్న బస్సులో జరిగిన భారీ పేలుడు సంభవించింది. ఇద్దరు మృతి చెందారు.
* 1997 చివరి నెలల్లో వరుస పేలుడు ఘటనలతో ఢిల్లీ చిగురుటాకులా వణికింది. అక్టోబరులో ఆయా ప్రాంతాల్లో అయిదు పేలుడు ఘటనలు చోటుచేసుకున్నాయి. ఆయా ఘటనల్లో ముగ్గురు మృతి చెందగా, 150 మందికిపైగా గాయపడ్డారు. నవంబరు 30న ఎర్రకోట ప్రాంతంలో రెండు పేలుళ్లు చోటుచేసుకున్నాయి. ముగ్గురు మృతి చెందగా, 70 మంది గాయపడ్డారు. డిసెంబరు 30న పంజాబీ బాగ్ సమీపంలో బస్సులో బాంబు పేలుడు సంభవించి నలుగురు ప్రయాణికులు మరణించగా, దాదాపు 30 మంది క్షతగాత్రులయ్యారు.

## శరీరభాగాలు చెల్లాచెదురు.. ప్రాణభయంతో హాహాకారాలు.. ప్రత్యక్ష సాక్షులు ఏం చెప్పారంటే!

ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో కారు పేలుడుతో ఘటనాస్థలంలో భీతావహ పరిస్థితులు నెలకొన్నాయి. పేలుడు ధాటికి పలువురి శరీర భాగాలు ఛిద్రమై.. రోడ్డు, వాహనాలపై చెల్లాచెదురుగా పడినట్లు ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. పెద్దఎత్తున మంటలు చెలరేగినట్లు చెప్పారు. అనేక వాహనాలు ధ్వంసమయ్యాయని, సమీపంలో ఉన్న మెట్రో స్టేషన్‌లోని దుకాణాల అద్దాలూ కూడా పగిలిపోయాయని తెలిపారు. ఆ సమయంలో తాను ఓ వ్యక్తితో మాట్లాడుతున్నానని.. అంతలోనే ఓ చేయి భాగం తన వెనుకే పడినట్లు అమిత్ ముద్గల్ అనే వ్యక్తి 'పీటీఐ' వార్తాసంస్థకు తెలిపారు. ''ఘటనాస్థలంలో పరిస్థితి నమ్మశక్యంగా అనిపించలేదు. భారీ పేలుడు సంభవించింది. కొన్ని సెకన్లలోనే మంటలు, పొగతో ఈ ప్రాంతం నిండిపోయింది. అందరూ ప్రాణభయంతో హాహాకారాలు చేస్తూ పరుగులు పెట్టారు'' అని ఘటనానంతర క్షణాలను అమిత్ ముద్గల్ గుర్తుచేసుకున్నా. పలువురు బాధితులను అంబులెన్సుల్లోకి ఎక్కించేందుకు సాయం చేసినట్లు చెప్పారు. ప్రత్యక్ష సాక్షిగా ఉన్న ఓ ఆటో డ్రైవర్ తన భయానక అనుభవాన్ని పంచుకున్నాడు. ''నా ఆటో ముందు ఓ కారు ఆగి ఉంది. ఎలా



జరిగిందో తెలియదు కానీ.. ఆ వాహనంలో ఏదో అకస్మాత్తుగా పేలింది'' అని తెలిపాడు. ఈ ఘటనలో అతడి తలకూ గాయమైంది. భవనాలు కంపించేంత స్థాయిలో పేలుడు తీవ్రత ఉందని ఓ దుకాణదారు తెలిపాడు. తాను నిలబడిన దుకాణం వణికిపోయిందన్నాడు. కిలోమీటరు దూరం నుంచే పేలుడు తీవ్రత అనుభవించినట్లు.. జామా మసీదు సమీపంలో పానీ పూరీ బండి నడుపుతున్న మనోజ్ అనే వ్యక్తి చెప్పాడు. ఛాతీలోనే పేలుడు సంభవించిందా? అన్న స్థాయిలో చాలా పెద్ద శబ్దం వినిపించిందన్నాడు. ఘటనాస్థలంలో తెగిపోయిన చేతులు, వేళ్లు చూశానని.. ఆ దృశ్యం భయంకరంగా ఉందని మరో ప్రత్యక్ష సాక్షి ఇర్ఫాన్ చెప్పాడు. తోపుడు బళ్లు నడిపేవారు, టాక్సీ డ్రైవర్లు చిక్కుకుపోయినట్లు తెలిపారు. పేలుడు అనంతర దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి.

## 122 స్థానాలు.. 3.7 కోట్లమంది ఓటర్లు.. రెండో దశ
## పోలింగ్‌కు బిహార్ సిద్ధం

రెండో దశ పోలింగ్‌కు బిహార్ సిద్ధమైంది. మొత్తం 122 అసెంబ్లీ స్థానాల్లో 1,302 మంది అభ్యర్థుల భవితవ్యం మంగళవారం ఈవీఎంలలో నిక్షిప్తం కానుంది. నీతీశ్ సర్కారులోని పలువురు మంత్రులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. సంక్లిష్టమైన బిహార్ సామాజిక వ్యవస్థలోని వివిధ వర్గాల మద్దతును నిలుపుకొనేందుకు పాలక ఎన్డీయే, ప్రతిపక్ష 'ఇండియా' కూటములకు ఈ చివరి దశ పోలింగ్ కీలకమైన పరీక్షగా నిలుస్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రెండో దశలో దాదాపు 3.70 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 1.75 కోట్ల మంది మహిళలు. 45 వేలకుపైగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో 40 వేల కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయి.



* పోలింగ్ నేపథ్యంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. నాలుగు లక్షలకుపైగా సిబ్బంది ఎన్నికల విధులు నిర్వర్తించనున్నారు.
* పశ్చిమ చంపారన్, తూర్పు చంపారన్, సీతామఢీ, మధుబని, అరారియా, కిషన్‌గంజ్ తదితర జిల్లాల్లో ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో చాలావరకు సీమాంచల్ ప్రాంతంలో ఉన్నాయి. ఇక్కడ ముస్లిం జనాభా అధికం.
* అత్యధికంగా హిసువా అసెంబ్లీ నియోజకవర్గంలో 3.67 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. లౌరియా, చన్‌పటియా, రక్సౌల్, త్రివేణిగంజ్, సుగౌలీ, బన్‌మన్‌ఖీ స్థానాల్లో అత్యధికంగా 22 మంది చొప్పున పోటీ పడుతున్నారు.
* సుపౌల్ స్థానం నుంచి మంత్రి బిజేంద్ర ప్రసాద్ యాదవ్ (జేడీయూ), గయా టౌన్ నుంచి మంత్రి ప్రేమ్ కుమార్ (భాజపా) వరుసగా ఎనిమిదోసారి గెలిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.
* మంత్రులు రేణుదేవీ, నీరజ్ కుమార్ సింగ్, లేశీ సింగ్, శీలా మండల్, జమా ఖాన్, మాజీ ఉపముఖ్యమంత్రి తార్‌కిశోర్ ప్రసాద్ (భాజపా), కాంగ్రెస్ బిహార్ అధ్యక్షుడు రాజేశ్ కుమార్ తమతమ స్థానాల నుంచి బరిలో దిగారు.
* ఎన్డీయే కూటమిలోని హిందుస్థానీ అవామ్ మోర్చా (హెచ్ఏఎం)కు కేటాయించిన ఆరు సీట్లు ఇదే దశలో ఉన్నాయి. కేంద్ర మంత్రి జీతన్ రామ్ మాంఝీకి చెందిన ఈ పార్టీ నుంచి నలుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు మరోసారి పోటీ చేస్తున్నారు.
* ఈ నెల 6న 121 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్వహించిన తొలిదశ ఎన్నికల్లో రికార్డు స్థాయిలో 65 శాతానికిపైగా పోలింగ్ నమోదైన విషయం తెలిసిందే.

## 'ఎస్ఐఆర్' పేరిట..
## ప్రజలకు కేంద్రం వేధింపులు: మమతా బెనర్జీ

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ విషయంలో కేంద్రంపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మరోసారి విరుచుకుపడ్డారు. 'ఎస్ఐఆర్' పేరిట ప్రజలను వేధిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో ఎన్నికల ముందు ఈ ప్రక్రియను ఎందుకింత హడావుడిగా నిర్వహిస్తున్నారో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. దీన్ని వెంటనే నిలిపేయాలని డిమాండ్ చేశారు. ''పెద్దనోట్ల రద్దు 'నోట్‌బందీ' మాదిరిగానే.. ఎస్ఐఆర్ అనేది 'ఓట్‌బందీ'. 'సూపర్ ఎమర్జెన్సీ'కి ఇది మరో రూపం. ఎస్ఐఆర్ పేరిట ప్రజలను కేంద్ర ప్రభుత్వం వేధిస్తోంది. ఓటర్ల జాబితా సవరణ అనేది రెండు, మూడు నెలల్లోనే పూర్తయ్యే ప్రక్రియ కాదు. దీనిని బలవంతంగా



నిర్వహిస్తున్నారు. ఎన్నికల సంఘం వెంటనే దీన్ని నిలిపేయాలి'' అని సిలిగుడీలో దీదీ మీడియాతో మాట్లాడుతూ అన్నారు. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా మాట్లాడుతున్నందుకు భాజపా తనను జైలుకు పంపినా, గొంతు కోసినా సరేనన్నారు. కానీ, ప్రజల ఓటు హక్కును కాలరాయొద్దని విజ్ఞప్తి చేశారు. వస్తు సేవల పన్నును అతిపెద్ద తప్పిదంగా పేర్కొన్నారు. దాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. జీఎస్టీ పేరుతో ప్రజలను కేంద్ర సర్కారు దోచుకుంటోందని ఆరోపించారు. పశ్చిమ బెంగాల్ , తమిళనాడు సహా 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఇటీవల ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభమైన విషయం తెలిసిందే. 321 జిల్లాలు, 1843 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దాదాపు 51 కోట్ల మంది ఓటర్లను కవర్ చేయనున్నట్లు ఈసీ తెలిపింది. దీన్ని వ్యతిరేకిస్తూ బెంగాల్‌లో నిరసనలు కొనసాగుతున్నాయి. ఇటీవల మమతా బెనర్జీ నేతృత్వంలో కోల్‌కతాలో భారీ ప్రదర్శన నిర్వహించారు.

## దిల్లీ పేలుడు ఘటన..
## అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు: అమిత్ షా

ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో పేలుడు ఘటనపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. ఈ ఘటనపై ఆయన మీడియాతో మాట్లాడారు. ''సాయంత్రం దాదాపు 7 గంటల ప్రాంతంలో ఎర్రకోట సమీపంలోని సుభాష్ మార్గ్ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఓ కారులో పేలుడు సంభవించింది. ప్రాథమిక సమాచారం ప్రకారం ఈ ఘటనలో కొంతమంది ప్రాణాలు కోల్పోయారు. పలువురు పాదచారులు గాయపడ్డారు. కొన్ని వాహనాలు దెబ్బతిన్నాయి.సమాచారం



అందిన 10 నిమిషాల్లోనే ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్, స్పెషల్ బ్రాంచ్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఎన్ఎస్‌జీ, ఎన్ఐఏ, ఫోరెన్సిక్ బృందాలు సమగ్ర దర్యాప్తు ప్రారంభించాయి. సమీపంలోని అన్ని సీసీటీవీ కెమెరాలను పరిశీలించాలని ఆదేశించాం. ఢిల్లీ సీపీ, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌ఛార్జ్‌తో మాట్లాడాను. వారు ప్రస్తుతం ఘటనా స్థలంలో పరిస్థితులను సమీక్షిస్తున్నారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తాం. వాస్తవాలను ప్రజల ముందు ఉంచుతాం'' అని అమిత్ షా తెలిపారు. అంతకుముందు ఈ ఘటనపై అమిత్ షా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీ పోలీస్ కమిషనర్‌తో మాట్లాడారు. పేలుడు ఘటన వివరాలను ఆయనకు కమిషనర్ వివరించారు. ఈ ఘటనకు సంబంధించి ఎప్పటికప్పుడు ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్‌ను కేంద్ర హోంమంత్రి ఆరా తీస్తున్నారు. మీడియాతో మాట్లాడిన అనంతరం.. ఢిల్లీ ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. వారి పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఘటనాస్థలాన్నీ పరిశీలించారు.

## మోదీ వల్లే ఇక్కడ ఉన్నా: చిరాగ్ పాసవాన్

ప్రధాని మోదీ అంటే తనకు అమితమైన అభిమానమని ఎల్‌జేపీ (రాంవిలాస్) పార్టీ అధినేత చిరాగ్ పాసవాన్ చెప్పారు. ఆయనకు బేషరతుగా తన మద్దతు ఉంటుందని వెల్లడించారు. ప్రస్తుతం బిహార్‌లో జరుగుతోన్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే భాగస్వామ్య పక్షం ఎల్‌జేపీ బరిలో ఉన్న సంగతి తెలిసిందే. మంగళవారం బిహార్‌లో రెండో విడత పోలింగ్ జరగనున్న నేపథ్యంలో జాతీయ మీడియా సంస్థ పాడ్‌కాస్ట్‌లో చిరాగ్ మాట్లాడారు. ''మన ప్రధానమంత్రి ఉన్నంతకాలం నేను ఎక్కడికి వెళ్లాలనుకోవడం లేదని మరోసారి గట్టిగా చెప్పాలని అనుకుంటున్నాను. నా అంకితభావం, అభిమానం అలాగే ఉన్నాయి. ఆయనంటే నాకు అమితమైన అభిమానం. అలాగే మోదీ వల్లే నేను ఎన్డీయేలో ఉన్నాను'' అని అన్నారు. నవంబర్ 14న ఫలితం మీకు అనుకూలంగా రాకపోవచ్చని కొందరు వ్యాఖ్యానిస్తున్నారన్న ప్రశ్నకు.. అలా అనుకోవడం మంచిదే అన్నారు. అలాంటి ఆలోచన తమపై చెడు దృష్టిని నివారిస్తుందని కౌంటర్ ఇచ్చారు. తనలో తన తండ్రి నేర్పిన విలువలు ఉన్నాయని, ఎన్నికల ఫలితాల తర్వాత ఇతరులతో పొత్తులు ఉండవని స్పష్టం చేశారు.

## జీపీఎస్ స్పూఫింగ్ అనుమానాలు..
## రంగంలోకి అజిత్ డోభాల్ ఆఫీస్!

ఢిల్లీ విమానాశ్రయంలో సాంకేతిక సమస్య కారణంగా గతవారం 800 విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. దానికి రెండురోజుల ముందు జీపీఎస్ స్పూఫింగ్ జరిగి ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలోనే జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ కార్యాలయం దర్యాప్తు ప్రారంభించింది. ఢిల్లీ ఐజీఐ ఎయిర్‌పోర్టు దేశంలోనే అత్యంత రద్దీ విమానాశ్రయం. ఇక్కడ నుంచి నిత్యం దాదాపు 1500లకు పైగా విమానాలు రాకపోకలు సాగిస్తాయి. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ డేటాకు అనుసంధానంగా ఉండే ఆటోమేటిక్ మెసేజ్ స్విచింగ్ సిస్టమ్‌లో సాంకేతిక సమస్య వల్ల విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీనికిముందు తమకు తప్పుడు నావిగేషన్ డేటా అందినట్లు కొందరు పైలట్లు వెల్లడించినట్లు తెలుస్తోంది. అది కూడా దేశ రాజధానికి 60 నాటికల్ మైళ్ల వ్యాసార్థంలో ఇలాంటి పరిస్థితి తలెత్తినట్లు పేర్కొన్నారు. ఇక ఎన్ఎస్ఏ కార్యాలయంలోని నేషనల్ సైబర్ సెక్యూరిటీ కోఆర్డినేటర్.. జాతీయ స్థాయిలో సైబర్ సెక్యూరిటీ అంశాలను సమన్వయపరుస్తుంది. ప్రస్తుతం ఎన్‌సీఎస్‌సీకి నవీన్ కుమార్ సింగ్ నాయకత్వం వహిస్తున్నారు. ఈ స్పూఫింగ్ జరిగిఉంటే.. ప్రస్తుత దర్యాప్తు ద్వారా దానికి గల కారణం, దానికి ఎంతవరకు అవకాశం ఉందనే అంశాలను పరిశీలించనున్నారు. అలాగే ఇటీవలి విమానాల అంతరాయం వెనక సాంకేతిక సమస్య, సైబర్ దాడి, అంతర్జాతీయ జోక్యం వంటి కారణాలు ఏమైనా ఉన్నాయా..? అని దర్యాప్తు చేయనున్నారు. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఈ దర్యాప్తులో భాగమయ్యాయి.

**జీపీఎస్ స్పూఫింగ్ అంటే..?**

నావిగేషన్ వ్యవస్థను ప్రభావితం చేసి నకిలీ జీపీఎస్ ద్వారా విమానాలను దారి మళ్లించే ప్రక్రియను




జీపీఎస్ సిగ్నల్ స్పూఫింగ్‌గా వ్యవహరిస్తారు. నిజమైన శాటిలైట్ సిగ్నల్స్‌ను అడ్డుకొని ఆ స్థానంలో నకిలీ సంకేతాలను పంపి జీపీఎస్ రిసీవర్‌ను తప్పుదోవ పట్టిస్తాయి. ఫలితంగా.. ప్రస్తుతమున్న ప్రదేశం, సమయాన్ని తప్పుగా చూపించేలా చేస్తాయి. పౌర విమానాలే లక్ష్యంగా అంతర్జాతీయ రూట్‌లలో ఈ తరహాలో జరిగిన సైబర్ దాడులు తరచూ వెలుగుచూస్తున్నాయి.

# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..

## 319 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్..



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు వారంలో తొలిరోజు లాభాల్లో ముగిశాయి. ప్రపంచ మార్కెట్లలోని మిశ్రమ సంకేతాల మధ్య మార్కెట్లు ఫ్లాట్‌గా మొదలయ్యాయి. అత్యధికంగా హెచ్‌సీఎల్, బజాజ్ ఫైనాన్స్ భారీ లాభాలను నమోదు చేశాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 83,198.20 పాయింట్ల వద్ద ఫ్లాట్‌గా ప్రారంభమైంది. ఆ తర్వాత మార్కెట్లు కోలుకొని లాభాల్లోకి దూసుకెళ్లాయి. ఇంట్రాడేలో 83,197.67 పాయింట్ల కనిష్టాన్ని తాకిన సెన్సెక్స్.. గరిష్టంగా 83,754.49 పాయింట్లు పెరిగింది. చివరకు 319.07 పాయింట్లు పెరిగి 83,535.35 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 82.05 పాయింట్ల లాభంతో 25,574.35 వద్ద స్థిరపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 6 పైసలు తగ్గి 88.71 వద్ద ముగిసింది. దాదాపు 1,787 షేర్లు పుంజుకోగా.. 2,183 షేర్లు పతనమయ్యాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.6 శాతం పెరగ్గా, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.4 శాతం తగ్గింది. మీడియా మినహా, మిగతా అన్ని రంగాల సూచీలు లాభాల్లో ముగిశాయి. ఐటీ ఇండెక్స్ 1.6 శాతం, ఫార్మా ఇండెక్స్ దాదాపు 1 శాతం, మెటల్ ఇండెక్స్ 0.6 శాతం పెరిగాయి.

నిఫ్టీలో ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, గ్రాసిమ్ ఇండస్ట్రీస్, బజాజ్ ఫైనాన్స్, విప్రో లాభాలను ఆర్జించగా.. ట్రెంట్, అపోలో హాస్పిటల్స్, మ్యాక్స్ హెల్త్‌కేర్, పవర్ గ్రిడ్, టాటా కన్స్యూమర్ నష్టపోయాయి. యూఎస్ సెనేట్ షట్‌డౌన్‌ను ముగించాలని నిర్ణయించిన తర్వాత సోమవారం యూరప్, ఆసియా మార్కెట్లు లాభపడ్డాయి. ఆదివారం ఆలస్యంగా జరిగిన ఓటింగ్‌లో ఫెడరల్ ప్రభుత్వానికి నిధులు సమకూర్చడానికి రాజీ బిల్లును ఆమోదించే ప్రక్రియను సెనేట్ ప్రారంభించింది. అయితే, డెమొక్రాట్లు అభ్యంతరం వ్యక్తం చేసి ప్రక్రియను ఆలస్యం చేస్తే తుది ఆమోదం చాలా రోజులు పట్టే అవకాశం ఉంది. డిసెంబర్ మధ్య నాటికి గడువు ముగిసే ఆరోగ్య సంరక్షణ పన్ను క్రెడిట్‌ను పొడిగించడంపై సెనేట్ ఓటు వేసే అవకాశం ఉంది. సుదీర్ఘంగా కొనసాగుతున్న షట్‌డౌన్ ముగిసిపోతుందన్న అంచనాల మధ్య ఎస్అండ్‌పీ500 అంచనాను 0.7 శాతం పెంచాయి. డౌ జోన్స్ ఇండస్ట్రియల్ యావరేజ్ అంచనా 0.1 శాతం పెరిగింది. జర్మనీ డాక్స్ 1.4 శాతం పెరిగి 23,891.71 చేరగా.. పారిస్ సీఏసీ 40 0.9 శాతం పెరిగి 8,024.23.. బ్రిటన్ ఎఫ్‌టీఎస్ఈ-100 0.5 శాతం పెరిగి 9,729.77కి చేరుకుంది.

# ఉడాయ్ నుంచి కొత్త ఆధార్ యాప్..




**న్యూఢిల్లీ:** భారత్ విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ కొత్త ఆధార్ యాప్‌ను తీసుకొచ్చింది. తమ ఆధార్ వివరాలను ఫోన్‌లో స్మార్ట్‌గా సేవ్ చేసి పెట్టుకోవడం, అవసరమైన వివరాలను ఇతరులతో సులువుగా పంచుకోవడం కోసం ఈ యాప్‌ను తీసుకొచ్చింది. ఆండ్రాయిడ్ యూజర్లు గూగుల్ ప్లేస్టోర్ నుంచి, ఐఫోన్ యూజర్లు యాపిల్ స్టోర్ నుంచి దీన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఉడాయ్ ఎక్స్ వేదికగా తెలిపింది. ఈ యాప్ ద్వారా పేపర్‌లెస్ ఎక్స్‌పీరియన్స్ పొందొచ్చని పేర్కొంది.

ఉడాయ్ నుంచి ఇప్పటికే ఎంఆధార్ పేరిట ఓ యాప్ అందుబాటులో ఉంది. దీనికి అదనంగా ఈ కొత్త యాప్‌ను తీసుకొచ్చారు. ఎం ఆధార్ తరహాలో దీంట్లో డిజిటల్ కార్డు డౌన్‌లోడ్, పీవీసీ కార్డు కోసం ఆర్డర్ చేయడం, ఇ-మెయిల్, మొబైల్ నంబర్ వెరిఫికేషన్, వర్చువల్ ఐడీ జనరేషన్ వంటి ఫీచర్లు ఏవీ ఉండవు. కేవలం మీ ఆధార్ వివరాలను భద్రపరుచుకోవడం, ఇతరులతో పంచుకోవడానికి ఉద్దేశించి మాత్రమే ఈ యాప్‌ను తీసుకొచ్చారు.

### కొత్త యాప్‌లో ఏమున్నాయ్?

ఆధార్ కార్డును ప్రతిసారీ వెంట తీసుకెళ్లాల్సిన అవసరం లేకుండా.. డిజిటల్‌గా అందుబాటులో ఉంచుకోవడానికి కొత్త ఆధార్ యాప్ ఉపయోగపడుతుంది. కుటుంబసభ్యుల ఆధార్ వివరాలన్నీ ఒకే డివైజ్‌లో పొందుపరచొచ్చు. ఫేస్ అథంటికేషన్ ఫీచర్ కూడా ఉంది. మీ కార్డు వివరాలను ఎవరితోనైనా షేర్ చేసుకోవాలన్నా ఈ యాప్ ద్వారా సులువు. ఆధార్‌లోని ఏయే వివరాలు పంచుకోవాలనుకుంటున్నారో వాటిని మాత్రమే ఎంపిక చేసుకునే సదుపాయం ఉంది. ఆధార్ బయోమెట్రిక్ వివరాలను లాక్ లేదా అన్‌లాక్ చేసుకునే వెసులుబాటూ ఉంది. మీ ఆధార్ వివరాలను చివరిసారిగా ఎక్కడ వినియోగించిందీ ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు.

### ఎలా వాడాలంటే?

గూగుల్ ప్లేస్టోర్ లేదా, యాపిల్ స్టోర్ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి.

యాప్‌నకు అవసరమైన పర్మిషన్లు ఇవ్వండి. తర్వాత టర్మ్స్ అండ్ కండీషన్స్‌ను యాక్సెప్ట్ చేయండి.

మీ ఆధార్‌తో అనుసంధానం అయిన మొబైల్ నంబర్‌ను ఎంటర్ చేయండి.

ఫోన్ నంబర్ వెరిఫికేషన్ తర్వాత ఫేస్ అథంటికేషన్ పూర్తి చేయాలని మిమ్మల్ని అడుగుతుంది.

వివరాలన్నీ నమోదు చేశాక సెక్యూరిటీ కోసం పిన్ సెట్ చేసుకోవాలి. ఆపై యాప్‌ను వినియోగించుకోవచ్చు.

# నెట్‌వర్క్‌లేని చోట చింతక్కర్లేదు..

## బీఎస్ఎన్ఎల్‌తో కలిసి జియో కొత్త ప్లాన్స్!




**న్యూఢిల్లీ:** ప్రముఖ టెలికాం సంస్థ రిలయన్స్ జియో ఇంట్రా సర్కిల్ రోమింగ్ రీఛార్జి ప్లాన్లను తీసుకొచ్చింది. ఇందుకోసం ప్రభుత్వరంగ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్‌తో జట్టుకట్టింది. జియో కవరేజీ లేని మారుమూల, గ్రామీణ ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌ను వినియోగించుకోవడం ఈ ఇంట్రా సర్కిల్ రోమింగ్ ముఖ్య ఉద్దేశం. ప్రస్తుతానికి మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ వినియోగదారుల కోసం ఈ ప్లాన్లను అందుబాటులోకి తెచ్చినట్లు జియో తెలిపింది.

జియో మొత్తం రెండు ఇంట్రా సర్కిల్ రోమింగ్ ప్లాన్లను లాంచ్ చేసింది. 28 రోజుల వ్యాలిడిటీతో వస్తున్న ఈ ప్లాన్ల ధరలను రూ.396, రూ.196గా నిర్ణయించింది. రూ.396 ప్లాన్‌లో 10జీబీ డేటా, వెయ్యి నిమిషాల టాక్‌టైమ్, వెయ్యి ఎస్సెమ్మెస్‌లు లభిస్తాయి. రూ.196 ప్లాన్‌తో 2జీబీ డేటా వెయ్యి నిమిషాల టాక్ టైమ్, వెయ్యి ఎస్సెమ్మెస్‌లు లభిస్తాయి. ఈ ప్లాన్లు కేవలం బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌పై మాత్రమే పనిచేస్తాయి. అంటే జియో సిగ్నల్ పూర్తిగా లేని సందర్భంలో బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌ను ఎంచుకున్నప్పుడు మాత్రమే ఈ ప్లాన్లు పనిచేస్తాయి. మరికొన్ని చోట్లా ఈ రోమింగ్ సేవలను అందించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.



# ఎవరిపైనా కుట్ర చేయడం లేదు..

## డ్రెస్సింగ్ రూమ్‌లో అంతా ఓకే..!

న్యూఢిల్లీ: టీ20ల్లో భారత జట్టు బెంచ్ బలం గట్టిగానే ఉన్నా ఆస్ట్రేలియా పర్యటనలో వారిని ఉపయోగించుకోలేదనేది వాస్తవం. వరుసగా విఫలమవుతున్నా సరే వైస్‌కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు, పేసర్ హర్షిత్ రానాకు ఎక్కువ అవకాశాలివ్వడం తీవ్ర దుమారం రేపింది. కోచ్ గౌతం గంభీర్ ఉద్దేశపూర్వకంగానే కొందరికి వంత పాడుతున్నారని, మ్యాచ్ విన్నర్లపై కుట్ర పన్నుతున్నారనే వార్తలు వైరలయ్యాయి. తనను లక్ష్యంగా చేసుకొని వ్యాపిస్తున్న ఈ విమర్శలపై కోచ్ గౌతీ స్పందించాడు. ఆస్ట్రేలియా పర్యటన ముగియడంతో నోరు విప్పిన అతడు.. తాను ఎవరిపైనా కుట్ర పన్నడం లేదని పేర్కొన్నాడు. రాహుల్ ద్రవిడ్ వారసుడిగా భారత కోచ్ పదవికి ఎంపికైన గౌతం గంభీర్ మొదటి నుంచి తన నిర్ణయాలతో వార్తల్లో నిలుస్తున్నాడు. ఆస్ట్రేలియా పర్యటలో తుది జట్టు ఎంపికలో కొందరిపై వివక్ష చూపాడని పలువురు అతడిని దుయ్యబట్టారు. అయితే.. తానేమీ ఉద్దేశపూర్వకంగా కొందరు ఆటగాళ్లను బెంచ్ మీద కూర్చోబెట్టడం లేదని చెబుతున్నాడు గంభీర్. 'స్క్వాడ్‌లో ప్రతిభావంతులైన ఆటగాళ్లు ఉండడం శుభపరిణామం. వాళ్లలో 11 మందినే ఎంపిక చేయడం చాలా కష్టమైన పని. టీమిండియా కోచ్‌గా నేను ఇప్పుడు ఇదే సంకట పరిస్థితి ఎదుర్కొంటున్నా. నాణ్యమైన ఆటగాళ్లతో మా బెంచ్ బలం కూడా ధ్రుఢంగానే ఉంది. ప్రతిఒక్కరు తుది జట్టులో ఆడేందుకు అర్హులే. అయితే.. మ్యాచ్ కోసం పదకొండు మందినే తీసుకోవాల్సి ఉంటుంది. బెస్ట్ కాంబినేషన్ ఆటగాళ్లను ఎంచకోవడం, ఆరోజుకు మ్యాచ్‌ను విజయంతో ముగించడం ఇదే మాకు ముఖ్యం. కానీ.. ఇదే విషయాన్ని ఎంపికవ్వని క్రికెటర్లకు తెలియజేయడం నాకు పెద్ద సవాల్. ఎందుకు తీసుకోలేదు? అనే విషయాన్ని వారికి స్పష్టంగా, అర్థమయ్యేలా చెప్పాల్సి వస్తుంది.

కొన్నిసార్లు సుదీర్ఘ సమయం మాట్లాడాల్సి ఉంటుంది. ముక్కుసూటిగా చెప్పడం కోచ్‌గా నాకే కాదు.. ఆటగాళ్లకు కూడా కష్టంగానే అనిపిస్తుంది. నిజాయతీగా ఉంటూ.. మనసులో ఉన్నది మాత్రమే చెబితే ఏ సమస్యా ఉండదు. ఇదే విధానాన్ని నేను అనుసరిస్తున్నా. కానీ, కొందరు లేనిపోనివి అంటగడుతుంటారు. అవేమీ నేను పట్టించుకోను. సహాయక సిబ్బంది గొప్పగా పని చేస్తున్నారు. డ్రెస్సింగ్ రూమ్‌లో వాతావరణం స్నేహపూర్వకంగా, పారదర్శకంగా ఉంది. నేను ఎప్పుడూ ఇలాంటి డ్రెస్సింగ్ రూమ్‌నే కోరుకుంటా' అని గంభీర్ వెల్లడించాడు.

ఆస్ట్రేలియా పర్యటనలో టీ20 స్టార్లను పక్కనపెట్టేయడంతో గంభీర్‌ను విమర్శలు ఎదుర్కొన్నాడు. సంజూ శాంసన్‌ను బెంచ్‌మీదే ఉంచడం, కుల్దీప్ యాదవ్‌ను ఒక్క మ్యాచ్‌కే తీసుకోవడం, వికెట్ల వీరుడైన అర్ష్‌దీప్ సింగ్‌ను తొలి రెండు మ్యాచులు ఆడించకపోవడం వంటివి బెడిసికొట్టాయి. విమర్శల దాడితో మేలుకొన్న గౌతీ మూడో టీ20లో అర్ష్‌దీప్, కుల్దీప్‌ను తీసుకున్నాడు. వీరిద్దరి రాకతో మ్యాచ్‌లో గెలుపొందిన టీమిండియా సిరీస్ సమం చేసింది. నాలుగో మ్యాచ్‌లోనూ ఆసీస్‌ను కట్టడి చేసిన సూర్యకుమార్ సేన్ ముందంజ వేసింది.

# రవీంద్ర జడేజా..

## చెన్నై సూపర్‌కింగ్స్‌కే ఆడతాడు: సురేశ్ రైనా



**న్యూఢిల్లీ:** ఎంఎస్ ధోని ఐపీఎల్ 2026లో ఆడతాడని టీమ్ఇండియా మాజీ క్రికెటర్ సురేశ్ రైనా అన్నాడు. అలాగే ధోనిని చెన్నైసూపర్ కింగ్స్ రిటైన్ చేసుకుంటుందని వివరించాడు. రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్‌గా కొనసాగుతాడని అతడు జోస్యం చెప్పాడు. అయితే రవీంద్ర జడేజాను చెన్నై సూపర్ కింగ్స్ జట్టు వదిలేస్తుందని ప్రస్తుతం వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో సురేశ్ రైనా అభిప్రాయం మాత్రం అందుకు భిన్నంగా ఉంది. రవీంద్ర జడేజా సీఎస్కేకు కీలకమైన ఆటగాడని.. కచ్చితంగా జట్టుతోనే ఉంటాడని ఆశాభావం వ్యక్తం చేశాడు.

"ఎంఎస్ ధోనిని చెన్నైసూపర్ కింగ్స్ కచ్చితంగా రిటైన్ చేసుకుంటుంది. అతడు ఐపీఎల్ 2026 సీజన్ ఆడతాడు. అలాగే కెప్టెన్‌గా రుతురాజ్ గైక్వాడ్ కొనసాగుతాడు. రవీంద్ర జడేజాను కూడా సీఎస్కే మరోసారి రిటైన్ చేసుకుంటుంది. అతడు చెన్నైకి ఎంతో కీలకమైన ఆటగాడు. కొన్ని సంవత్సరాలుగా జడేజా జట్టు కోసం ఎంతో చేస్తున్నాడు. కాబట్టి 'సర్ రవీంద్ర జడేజా' కచ్చితంగా టీమ్‌తోనే ఉండాలి' అని సురేశ్ రైనా పేర్కొన్నాడు.

అయితే.. రవీంద్ర జడేజా.. రాజస్థాన్ రాయల్స్‌కు వెళతాడు, సంజుశాంసన్ చెన్నైసూపర్ కింగ్స్‌కు వస్తాడు అనే వార్తలు వివవస్తున్న వేళ.. సురేశ్ రైనా చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇవి సీఎస్కే అభిమానుల్లో చర్చనీయాంశంగా మారాయి. ఐపీఎల్‌లోని 10 ఫ్రాంఛైజీలు తమ ఆటగాళ్ల రిటైన్ జాబితాను నవంబర్ 15లోగా ప్రకటించాల్సి ఉంది. అప్పుడే అసలు విషయం తేలే అవకాశముంది.

ఎంఎస్ ధోని ఐపీఎల్ 2026 సీజన్‌లో ఆడతాడని చెన్నైసూపర్ కింగ్స్ సీఈఓ కాశీ విశ్వనాథన్ ఇటీవలే ధ్రువీకరించిన విషయం తెలిసిందే. దీంతో ధోని రానున్న ఐపీఎల్‌లో ఆడతాడా? లేదా? అనే చర్చకు తెరపడింది. 44 ఏళ్ల ధోనీ ఈ టోర్నీలో అతి పెద్ద వయసున్న ఆటగాడిగా కొనసాగుతున్నాడు. అలాగే గత సీజన్‌లో.. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డును గెలుచుకున్న అత్యంత పెద్ద వయస్కుడిగా కూడా రికార్డు నెలకొల్పిన విషయం తెలిసిందే.

# మాజీ కెప్టెన్‌కు గుండెపోటు..



**ఢాకా:** బంగ్లాదేశ్ మాజీ క్రికెటర్ ఫరూక్ అహ్మద్‌కు కొద్దిలో ప్రాణాపాయం తప్పింది. గుండెపోటుతో ఆస్పత్రిలో చేరిన అతడికి సకాలంలో వైద్యం అందడంతో ప్రాణం దక్కింది. బంగ్లాదేశ్ బోర్డు ఉపాధ్యక్షుడిగా సేవలందిస్తున్న అతడు ఆదివారం ఛాతిలో తీవ్రమైన నొప్పితో ఇబ్బంది పడ్డాడు. ఉన్నట్టుండి కింద కూలబడిపోయిన అతడిని వెంటనే ఢాకాలోని దవాఖానకు తరలించారు. ప్రస్తుతం ఫరూక్ ఆరోగ్యం మెరుగ్గానే ఉందని బంగ్లా బోర్డు తెలిపింది. దాంతో.. అభిమానులు, కుటుంబ సభ్యులు హమ్మయ్య అని ఊపిరిపీల్చుకున్నారు.

'శనివారం రాత్రి నుంచి ఫరూక్ ఆరోగ్యం సరిగ్గా లేదు. ఆదివారం మధ్యాహ్యం అతడికి తీవ్రమైన ఛాతి నొప్పి వచ్చింది. దాంతో.. కుటుంబ సభ్యులు అతడిని వెంటనే ఢాకాలోని ఆస్పత్రికి తరలించారు. ఫరూక్‌కు ఆంజియోగ్రామ్ నిర్వహించిన వైద్యులు రక్తనాళాల్లో బ్లాక్ ఉండడం గమనించారు. ప్రాణాలు కాపాడేందుకు సత్వరమే అతడికి స్టెంట్ వేశారు. ప్రస్తుతానికి ఫరూక్ ఆరోగ్యం నిలకడగా ఉంది. క్రిటికల్ కేర్ యూనిట్‌లో ఉన్న అతడి ఆరోగ్యాన్ని వైద్యులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు' అని బంగ్లా బోర్డు వెల్లడించింది.

### మధ్యంతర అధ్యక్షుడిగా

బంగ్లాదేశ్ వెటరన్ ప్లేయర్లలో ఫరూక్ అహ్మద్ ఒకడు. 1984 నుంచి 1999 వరకూ జాతీయ జట్టుకు ఆడిన ఫరూక్ కెప్టెన్‌గానూ వ్యవహరించాడు. వీడ్కోలు అనంతరం రెండుసార్లు జాతీయ సెలెక్టర్‌గా సేవలందించాడు ఫరూక్. 2024 ఆగస్టులో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు నజ్ముల్ హసన్ రాజీనామా చేయడంతో అతడు మధ్యంతర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాడు. తొమ్మిది నెలల పాటు ఈ హోదాలో ఉన్న ఫరూక్ ఎన్నికల తర్వాత ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యాడు.

# భారత మహిళా క్రికెట్ జట్టుకు

# గావస్కర్ సందేశం..




**న్యూఢిల్లీ:** వన్డే ప్రపంచకప్ గెలిచిన భారత మహిళల జట్టు సభ్యులకు టీమ్ఇండియా దిగ్గజ బ్యాటర్ సునీల్ గావస్కర్ ఓ సందేశం పంపారు. వరల్డ్ కప్ సాధించిన సందర్భంగా వారికి ఇస్తామని ప్రకటించిన నగదు బహుమతులు లభించకపోతే నిరాశకు గురికావొద్దన్నారు. ఉచిత ప్రచారం పొందడానికి అనేక బ్రాండ్లు, కొంతమంది వ్యక్తులు తప్పుడు ప్రకటనలు చేస్తారని గావస్కర్ అన్నారు. 1983లో భారత పురుషుల జట్టు వరల్డ్ కప్ సాధించినప్పుడు తమకు ఇలాంటి అనుభవం ఎదురైందని గుర్తుచేసుకున్నారు. ఇటీవల జరిగిన మహిళల వన్డే ప్రపంచ కప్‌లో ఫైనల్‌లో హర్మన్‌ప్రీత్ సేన దక్షిణాఫ్రికాను ఓడించి విశ్వవిజేతగా నిలిచింది.

ఛాంపియన్‌గా నిలిచిన టీమ్ఇండియాకు ఐసీసీ నుంచి దాదాపు రూ.40 కోట్ల ప్రైజ్‌మనీ అందనుంది. బీసీసీఐ రూ.51 కోట్ల నగదు బహుమతి ప్రకటించింది. వన్డే ప్రపంచ కప్ గెలిచిన జట్టులో ఉన్న తమ రాష్ట్రాల క్రికెటర్లకు కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా నగదు బహుమతి అందిస్తామని హామీ ఇచ్చాయి. జట్టులోని స్టార్ ఆటగాళ్లతో కొన్ని బ్రాండ్స్ స్పాన్సర్‌షిప్ ఒప్పందాలు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో వాగ్దానం చేసినట్లుగా నగదు బహుమతులు అందకపోతే నిరుత్సాహానికి గురికావొద్దని భారత మహిళల జట్టుకు గావస్కర్ సూచించారు.

'వరల్డ్ కప్ సాధించిన భారత అమ్మాయిలకు ఒక హెచ్చరిక. వాగ్దానం చేసిన వాటిలో కొన్ని అవార్డులు మీకు రాకపోతే దయచేసి నిరాశ చెందకండి. భారత్‌లో కొంతమంది ప్రకటనదారులు, బ్రాండ్లు, వ్యక్తులు ఉచితంగా ప్రచారం పొందడానికి మిమ్మల్ని వాడుకుంటారు. జట్టును అభినందిస్తూ పూర్తి పేజీ ప్రకటనలు ఇస్తారు. హోర్డింగ్‌లు పెడతారు. జట్టు, ఆటగాళ్ల వ్యక్తిగత స్పాన్సర్లు కాకుండా మిగిలిన వారు తమ బ్రాండ్లను లేదా తమ గురించి ప్రచారం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు తప్ప భారత క్రికెట్‌కు కీర్తిని తెచ్చిన వారికి ఏమీ ఇవ్వరు.

1983లో ప్రపంచ కప్ సాధించిన జట్టుకు కూడా చాలా వాగ్దానాలు చేశారు. అప్పట్లో మీడియాలో చాలా కవరేజ్ వచ్చింది. దాదాపు అవన్నీ ఎప్పుడూ కార్యరూపం దాల్చలేదు. ఈ విషయంలో మీడియాను నిందించలేం. ఎందుకంటే వారు ఈ సిగ్గులేని వ్యక్తులు తమను కూడా ఉపయోగించుకుంటున్నారని గ్రహించకుండా గొప్ప ప్రకటనలను సంతోషంగా ప్రచారం చేశారు. కాబట్టి అమ్మాయిలారా ఈ సిగ్గులేని వారు తమను తాము ప్రమోట్ చేసుకోవడానికి మీ విజయాన్ని ఉపయోగిస్తుంటే బాధపడకండి. ప్రపంచ కప్ సాధించిన మీకు మరోసారి హృదయపూర్వక అభినందనలు. దేశం మిమ్మల్ని చూసి గర్విస్తోంది. జై హింద్' అని గావస్కర్ వివరించారు.







MOVIE TIME

# రవితేజ కొత్త సినిమా పోస్టర్ రిలీజ్

**టాకీస్:** మాస్ మహారాజా రవితేజ, కిషోర్ తిరుమల దర్శకత్వంలో ఆర్76 తెరకెక్కుతున్నసంగతి తెలిసిందే. సుధాకర్ చెరుకూరి భారీగా ఈ సినిమాను ప్లాన్ చేసారు. ఇందులో రవితేజ సరసన ఆషికా రంగనాథ్ కథానాయికగా నటిస్తోంది. ఈ సినిమాకి 'భర్త మహాశయులారా' టైటిల్ అనుకుంటున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. అయితే సోమవారం ఈ సినిమా టైటిల్ విడుదల చేయడానికి టైం ఫిక్స్ చేశారు మేకర్స్. ఈ లోపే టైటిల్ సగం చెప్పి చెప్పకుండా పోస్టర్స్ లీక్ చేసారు. టైటిల్ చూస్తే.. మొత్తానికి 'భర్త మహాశయులారా' టైటిల్నే ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. తాజాగా ఓ పాట కోసం ప్రత్యేకమైన సెట్ వేశారు. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీలో రూపొందుతున్న అదిరిపోయే డ్యాన్స్ నంబర్ చిత్రీకరిస్తున్నారు. ఎమోషనల్ కథలతో అలరించే దర్శకుడు కిశోర్ తిరుమల ఈ చిత్రాన్ని అన్ని వర్గాల ప్రేక్షకుల ఆకట్టుకునేలా రూపొందిస్తున్నారు. ఈ సినిమాకి సెన్సేషనల్ కంపోజర్ భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్ అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ ప్రసాద్ మూరెళ్ళ. నేషనల్ అవార్డు గ్రహీత శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్. ఏఎస్ ప్రకాష్ ఆర్ట్ డైరెక్టర్.



ట్రాక్‌పై ఉన్నాయి.

**టాకీస్:** పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ఆతిథ్యం ఎలా ఉంటుందో అభిమానులు, మూవీ లవర్స్‌కు ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఇప్పటికే చాలా మంది సెలబ్రిటీలు ప్రభాస్ ఇంటి భోజనం ఎంత ప్రత్యేకమో పలు సందర్భాల్లో షేర్ చేసుకున్నారు. ప్రభాస్ ఆతిథ్యాన్ని స్వీకరించిన వారిలో తాజాగా అతడి కోస్టార్ ఇమాన్వీ కూడా చేరిపోయింది. ప్రభాస్, ఇమాన్వీ కాంబినేషన్‌లో ఫౌజీ సినిమా వస్తోన్న విషయం తెలిసిందే. ఫౌజీ మూవీ షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో

# మెగాస్టార్‌తో మిల్కీ బ్యూటీ ఐటెం సాంగ్




టాకీస్: మెగాస్టార్ చిరంజీవి హీరోగా, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రంపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. చిరంజీవి కామెడీ టైమింగ్, అనిల్ రావిపూడి మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్ కలవడంతో ఈ సినిమా ప్రేక్షకులకు నవ్వుల విందు పంచడం ఖాయమని అభిమానులు ఆశిస్తున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఓ ఆసక్తికరమైన వార్త ఫిలింనగర్‌లో చక్కర్లు కొడుతోంది. ఈ చిత్రంలో ఓ స్పెషల్ సాంగ్ ఉండనుందని, అందులో మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా మెగాస్టార్‌తో కలిసి స్టెప్పులేయనున్నారని తెలుస్తోంది. ఇటీవల కాలంలో తమన్నా స్పెషల్ సాంగ్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారారు. ఆమె నటించిన 'కావాలయ్య', 'డా డా డాస్' వంటి పాటలు షేక్ చేశాయి. ఇప్పుడు అదే జోరుతో చిరంజీవి సినిమాలో కూడా మాస్ ఆడియన్స్‌కు అదిరిపోయే కిక్ ఇవ్వడానికి సిద్ధమవుతున్నట్లు



సమాచారం. ఈ పాట కోసం చిత్ర యూనిట్ భారీ సెట్‌ను నిర్మించి, గ్రాండ్‌గా చిత్రీకరించేందుకు సన్నాహాలు చేస్తోందట. పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాలో, మాస్ ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు, కమర్షియల్ హంగుల కోసం దర్శకుడు అనిల్ రావిపూడి ఈ పాటను ప్రత్యేకంగా డిజైన్ చేస్తున్నారని అంటున్నారు. చిరంజీవి ఎనర్జీకి, తమన్నా గ్లామర్‌కు తోడు సంగీత దర్శకుడు థమన్ అందించే మ్యూజిక్ కూడా తోడైతే థియేటర్లలో పండగ వాతావరణం ఖాయమని టాక్ వినిపిస్తోంది. అయితే, ఈ వార్తలపై చిత్ర బృందం నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఒకవేళ ఇదే నిజమైతే, వెండితెరపై చిరంజీవి, తమన్నా డ్యాన్స్ చూడటం అభిమానులకు కనుల పండుగే అవుతుంది.

## యువ హీరో శర్వానంద్ తాజా చిత్రం బైకర్

టాకీస్: అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో టాలీవుడ్ యువ హీరో శర్వానంద్ నటిస్తున్న చిత్రం బైకర్. ఈ చిత్రంలో మాళవికా నాయర్ హీరోయిన్‌గా నటిస్తోంది. మీరు బైకర్ స్పీడ్ ఎలా ఉందో చూశారు. ఇక ఇప్పుడు ప్రెప్పీ మెలోడీ టైం వచ్చేసిందంటూ.. ఫస్ట్ సింగిల్ ప్రోమో అప్‌డేట్ లుక్ విడుదల చేశారు. హెల్మెట్ పెట్టుకున్న హీరోయిన్‌తో రొమాంటిక్ మూడ్‌లో ఉన్న శర్వానంద్ స్టిల్ సాంగ్‌పై క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ పాట ప్రోమోను నవంబర్ 11న లాంచ్ చేయనున్నట్టు ప్రకటించారు. గిబ్రాన్




మ్యాజికల్ ఆల్బమ్‌ను రెడీ చేస్తున్నట్టు తాజా లుక్ చెప్పకనే చెబుతోంది. ఇప్పటికే విడుదల చేసిన గ్లింప్స్.. ఇక్కడ ప్రతీ బైకర్‌కు ఓ కథ ఉంటుంది. సమయంతో పోరాడే కథ.. చావుకు ఎదురెళ్లే కథ.. అంటూ సాగే వాయిస్‌తో ఓవర్‌తో మొదలైన గ్లింప్స్ బైక్ రేసుతో సాగుతుంది. ఏం జరిగినా పట్టువదలని మొండోళ్ల కథ అంటూ బైక్ రేసింగ్ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో సినిమా ఉండబోతున్నట్టు హింట్ ఇచ్చేస్తుంది. మీ హెల్మెట్లను పట్టుకోండి.. రైడ్ వైల్డ్‌గా ఉండబోతుంది.. గూస్‌బంప్స్ తెప్పించే అడ్వెంచరస్ రైడ్‌కు సిద్దంగా ఉండండి.. అంటూ శర్వానంద్ టీం ఇప్పటికే బైకర్ సినిమాపై అంచనాలు భారీగా పెంచేస్తుంది. ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ బ్యానర్‌లో వంశీ కృష్ణారెడ్డి, ఉప్పలపాటి ప్రమోద్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. బైకర్‌లో డాక్టర్ రాజశేఖర్ శర్వానంద్ తండ్రి పాత్రలో కనిపించనుండగా బ్రహ్మాజి, అతుల్ కులకర్ణి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి గిబ్రాన్ సంగీతం అందిస్తున్నాడు.

## తండ్రీకొడుకుల పోటాపోటీ పాటల డ్యాన్స్‌లు

### దుమ్మురేపుతున్న చిరు, చరణ్‌లు

టాకీస్: ఒకప్పుడు హీరోల మధ్య పోటీ ఉండేది. ఒక హీరో చేసిన కథ, పాట్స ÷ట్ హిట్టయితే అలాంటిదే తమ హీరో కూడా చేయాలని అభిమానులు కోరుకునేవారు. అందుకు తగ్గట్టే హీరోలు, దర్శకులు ఆయా సన్నివేశాలను డిజైన్ చేసుకునేవారు. ఇప్పుడు సొంతవారి నుంచే పోటీ ఎదురవుతోంది. అటు చిరంజీవి , ఇటు రామ్‌చరణ్ తమ కొత్త చిత్రాల్లోని



పాటలతో సోషల్ మీడియాను ఊపేస్తున్నారు. పోటీ మాట ఎలా ఉన్నా, మెగా అభిమానులు మాత్రం ఆనందంలో తేలియాడుతున్నారు.అనిల్ రావిపూడి దర్శకత్వంలో చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు' . నయనతార కథానాయిక. శరవేగంగా చిత్రీకరణ జరుపుకొంటున్న ఈ మూవీ సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. చిత్ర ప్రచారంలో భాగంగా విడుదల చేసిన 'మీసాల పిల్ల సాంగ్ యూత్‌ను విశేషంగా ఆకట్టుకుంటోంది. భీమ్స్ సిసిరోలియో సంగీతం, ఉదిత్ నారాయణ్ గాత్రానికి చిరంజీవి గ్రేస్ తోడవడంతో ఈ పాట ట్రెండ్ అవుతోంది. ఇప్పటికే 50 మిలియన్ వ్యూస్‌తో దూసుకుపోతోంది. సాంగ్‌ను ఎంజాయ్ చేస్తూ డ్యాన్స్ చేయడంలో చిరంజీవి ఆయనకు ఆయనే సాటి. తెరపై ఆ గ్రేస్ చిరులో మాత్రమే చూడగలం. తండ్రి బాటలోనే పయనిస్తూ అదరగొడుతున్నారు రామ్‌చరణ్. ఆయన కథానాయకుడి గా బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'పెద్ది'. జాన్వీకపూర్ కథానాయిక. ఏఆర్ రెహమాన్ సంగీత దర్శకుడు. శరవేగంగా చిత్రీకరణ జరుపుకొంటున్న ఈ మూవీ నుంచి 'చికిరి.. చికిరి' అంటూ సాగే పాటను విడుదల చేశారు. ఇందులో చరణ్ వేసిన స్టెప్ సోషల్‌మీడియాను ఊపేస్తోంది. చిన్నా, పెద్దా వయసుతో సంబంధం లేకుండా దీన్ని రీక్రియేట్ చేసి, పంచుకుంటున్నారు. అతి తక్కువ సమయంలోనే ఈ పాట 50 మిలియన్ వ్యూస్‌ను సొంతం చేసుకోవడం గమనార్హం. వచ్చే ఏడాది మార్చి 27న 'పెద్ది ప్రేక్షకుల ముందుకురానుంది.

## ఆకట్టుకుంటున్న సిగ్మా ఫస్ట్‌లుక్ పోస్టర్



**టాకీస్:** టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్ మరోసారి పవర్ ప్యాక్డ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. అయితే ఈ సినిమాతోనే తమిళ స్టార్ విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఇప్పటికే షూటింగ్ శరవేగంగా సాగుతుండగా, తాజాగా చిత్ర బృందం టైటిల్ మరియు ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. సినిమా టైటిల్‌ను 'సిగ్మాగా ఫిక్స్ చేశారు. విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో సందీప్ కిషన్ బంగారం, నగదు కట్టలపై చేతికి కట్టు కట్టుకుని సీరియస్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఆయన కళ్లల్లో కనిపిస్తున్న యాంగర్, ఇంటెన్సిటీ ఈ మూవీ టోన్‌ను స్పష్టంగా చెబుతోంది.

సందీప్ ఇప్పటివరకు చేసిన రోల్స్ కంటే భిన్నంగా, ఈసారి పూర్తి స్థాయి యాక్షన్ ప్యాక్డ్ అవతారంలో కనిపించనున్నారు. ఫ్యాన్స్ ఈ లుక్‌పై ఫిదా అవుతున్నారు. సమాచారం ప్రకారం, సిగ్మా ఒక ట్రెజర్ హంట్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. సస్పెన్స్, యాక్షన్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో కూడిన ఈ మూవీ విజువల్‌గా గ్రాండ్‌గా ఉండబోతోందని చిత్ర బృందం చెబుతోంది. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుభాస్కరన్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ప్రాజెక్ట్ ప్రారంభం నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి.

తమిళ స్టార్ దళపతి విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ ఈ సినిమాతో దర్శకుడిగా ఎంట్రీ ఇస్తుండటం మరింత స్పెషల్. ఇప్పటికే స్క్రిప్ట్ వర్క్, విజువల్స్ విషయంలో ఆయన చూపుతున్నప్రత్యేక దృష్టి సినీ వర్గాల్లో చర్చనీయాంశమవుతోంది. తొలి సినిమానే పాన్

## ప్రేమంటే మూవీ నుంచి పెళ్లి షురూ పాట విడుదల

టాకీస్: ప్రియదర్శి, ఆనంది జంటగా తెరకెక్కిన చిత్రం 'ప్రేమంటే' శ్రీ వేంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ బేనర్‌పై పుస్కూర్ రామ్‌మోహన్ రావు, జాన్వీ నారంగ్ నిర్మించారు. రానా దగ్గుబాటి సమర్పిస్తున్నారు. ఈనెల 21న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఈ చిత్రం నుంచి పెళ్లి పాట 'పెళ్లి షురూ'ను హీరోయిన్ శ్రీలీల చేతుల మీదుగా విడుదల చేశారు.వివాహ వేడుకల ఉత్సాహాన్ని, సంబరాన్ని తెలిపేలా ఉన్న ఈ పాటను శ్రీమణి రాశారు. దీపక్ బ్లూ, శ్రేయా ఘోషల్ ఆలపించగా, లియోన్ జేమ్స్ సంగీతం అందించారు. ఈ పాట నూతన జంట




భావోద్వేగాలను అందంగా ఆవిష్కరిస్తుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: రాఘవేంద్ర తిరుణ్, సినిమాటోగ్రఫీ: విశ్వనాథ్ రెడ్డి.

## దే దే ప్యార్ దే 2 రిలీజ్ టైం..

### ప్రమోషన్స్‌లో బిజీబీజీగా రకుల్ ప్రీత్ సింగ్

**టాకీస్:** బాలీవుడ్ యాక్టర్ అజయ్ దేవగన్, రకుల్ ప్రీత్ సింగ్ కాంబోలో వచ్చిన 'దే దే ప్యార్ దే'. 2019లో ప్రేక్షకుల ముందుకొచ్చి బ్లాక్ బస్టర్‌గా నిలిచిన ఈ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైర్‌కు సీక్వెల్‌గా వస్తోంది 'దే దే ప్యార్ దే 2'. అన్షుల్ శర్మ డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రం నవంబర్ 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న నేపథ్యంలో రకుల్ ప్రీత్ సింగ్, అజయ్ దేవ్‌గన్, మాధవన్ టీం ప్రమోషన్స్‌లో బిజీబిజీగా ఉంది.

సల్మాన్ ఖాన్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న పాపులర్ షో బిగ్‌బాస్ సీజన్ 19లో రకుల్ ప్రీత్ సింగ్ టీం సందడి చేసింది. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఫస్ట్ పార్ట్‌లో తనకంటే వయసులో చాలా చిన్నదైన ఆయేషా (రకుల్ ప్రీత్ సింగ్)ను ప్రేమ పెళ్లి చేసుకోవాలి అనుకున్న ఆశిష్ (అజయ్ దేవగణ్) తన మాజీ భార్య (టబు) పర్మిషన్‌తోపాటు ఆమె కుటుంబం అంగీకారాన్ని పొందడానికి ప్రయత్నిస్తాడు.



ఆయేషా కుటుంబాన్ని ఆశీష్ ఎలా పెళ్లికి ఒప్పిస్తాడు అనే నేపథ్యంలో సీక్వెల్ సాగనుందని ఇప్పటికే ట్రైలర్ హింట్ ఇచ్చేస్తుంది. సీక్వెల్‌లో ఆయేషా తండ్రి రోల్‌లో కోలీవుడ్ స్టార్ యాక్టర్ ఆర్. మాధవన్ నటిస్తున్నాడు. ఈ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌కు లవ్ రంజన్ కథ అందించారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.